## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను...సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

# జనసముద్రం న్యూస్

నిరంతర వార్తా ప్రవాహం

ప్రతి అక్షరం జనం కోసం






JANASAMUDRAM.COM

సంపుటి:04 | సంచిక:359 | సోమవారం సెప్టెంబర్ 07, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00


## హెల్త్ కార్డుల విషయంలో సీఎం నిర్ణయం సంతోషపెట్టింది: ఏపీ జేఏసీ



మిగతాది 2లో

## వెలిగొండ ఫీడర్ కెనాల్‌లో యువకుల గల్లంతుపై మంత్రుల ఆరా



మిగతాది 2లో

# బీఆర్ఎస్ వైఖరి మారకపోతే..

### మరో పదేళ్లూ రోడ్లపైనే: మంత్రి శ్రీధర్ బాబు

- కాంగ్రెస్ జవాబుదారీతనంతో పని చేస్తోంది.
- బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీకి వస్తే సమాధానం ఇస్తాం.
- కేసీఆర్ సభకు వచ్చి అనుభవం పంచుకోవాలి.
- సోషల్ మీడియా విష ప్రచారాన్ని తిప్పికొట్టాలి.



భారత రాష్ట్ర సమితి నేతలతో రోడ్లపై మాట్లాడించడం కాదు.. అసెంబ్లీకి వస్తే సమాధానం చెప్తామని తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్ సభకు వచ్చి.. వారి అనుభవాన్ని పంచుకోవాలన్నారు. ఇందిరాపార్క్ వద్ద పీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో పాటు ముఖ్యనేతలు జగ్గారెడ్డి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జవాబుదారీతనంతో పని చేస్తోందన్నారు. "విపక్షాలు సోషల్ మీడియాలో చేస్తున్న విష ప్రచారాలను తిప్పికొట్టాలి. ఆర్టీసీ బస్సుల్లో కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రమే ఉచిత ప్రయాణం చేస్తున్నారా? పేదల ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. పేజి 2లో ▶

# ఏపీలో కొత్త పింఛన్లు..
# దరఖాస్తులకు ప్రభుత్వం శ్రీకారం



అమరావతి: ఏపీలో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు సహా వివిధ వర్గాల నుంచి సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు దరఖాస్తులు స్వీకరించనుంది. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి.. దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధరణ అనంతరం దశలవారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 61,92,396 మంది పింఛనుదారులకు నెలకు రూ.2,694 కోట్ల మేర పంపిణీ చేస్తుండగా.. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు పింఛన్ల కోసం రూ.73,508 కోట్లు ఖర్చు చేసింది.

# ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి..
# కేసీఆర్ దిశానిర్దేశం




### బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశానిర్దేశం



- అసెంబ్లీ సమావేశాలకు అందరూ తప్పకుండా హాజరుకావాలి
- ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి
- కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఉభయసభల్లో ఎండగట్టాలి
- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన అట్టర్‌ఫ్లాప్
- రేవంత్ చిల్లర మాటలు మాట్లాడుతున్నారు
- స్పీకర్ పక్షపాత వైఖరిపై కేసీఆర్ ఆగ్రహం

బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కేసీఆర్ మాట్లాడారు.. అసెంబ్లీ సమావేశాలకు అందరూ తప్పకుండా హాజరుకావాలన్నారు. శాసనసభ, మండలిలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలి. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి. కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఉభయసభల్లో ఎండగట్టాలన్నారు.

సీఎం రేవంత్ అసెంబ్లీలో, బయట బూతులు మాట్లాడుతున్నారని కేసీఆర్ ఫైర్ అయ్యారు. పాలన చేతకాక ఈ తరహాలో వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన అట్టర్‌ఫ్లాప్ అని అన్నారు. కాంగ్రెస్ థర్డ్ క్లాస్ పాలన కొనసాగిస్తోంది. కాంగ్రెస్ పోవడం ఖాయమని అర్థమైంది. రేవంత్ చిల్లర మాటలు మాట్లాడుతున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం. ఈ విషయం ఆ పార్టీ నేతలకు అర్థమైంది. అందుకే ఈ దోపిడీ చేస్తున్నారు. స్పీకర్ పక్షపాత వైఖరి అప్రజాస్వామికమన్నారు. సభలో స్పీకర్ పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని కేసీఆర్ వేలెత్తిచూపారు. పేజి 2లో ▶

## గ్రామ నిధులు నేరుగా సర్పంచులకే అందేలా త్వరలో కొత్త బిల్లు: మంత్రి సీతక్క



మిగతాది 2లో

## ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్న



మిగతాది 2లో

# గాల్లో ఉండగా సాంకేతిక సమస్య..
# విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

**టేకాఫ్ అయిన కొంత సేపటికే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో వెనక్కి తిరిగి వచ్చింది.**





విమానాన్ని అరగంటకు పైగా గాలిలో చక్కర్లు కొట్టించారు

టేకాఫ్ అయిన కొంత సేపటికే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో వెనక్కి తిరిగి వచ్చింది. ఈ ఘటన బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. విమానాశ్రయ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. వర్జిన్ అట్లాంటిక్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం ఆదివారం ఉదయం 8.20 గంటలకు లండన్‌కు బయలుదేరింది.

టేకాఫ్ అయిన కొద్ది సేపటికే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు గుర్తించిన పైలట్లు విమానాశ్రయ అధికారులను అప్రమత్తం చేశారు. విమానాన్ని అరగంటకు పైగా గాలిలో చక్కర్లు కొట్టించారు. అనంతరం వెనక్కి తీసుకువచ్చి విమానాశ్రయంలో 'ఎమర్జెన్సీ ల్యాండింగ్' (జుఎవతీస్త్రవఅషఎ ాఖఅఽఱఅస్త్ర) చేశారు. ఘటన జరిగిన సమయంలో విమానంలో సిబ్బంది సహా మొత్తం 270మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించి, విమానాన్ని తనిఖీలకు తరలించారు. ఘటనపై డీజీసీఏ అధికారులు దర్యాప్తు చేపట్టారు. 2లో




# సంపాదకీయం

## రేవంత్‌కు రెండో చాన్స్ ఉందా...

ఇల్లు అలకగానే పండుగ కాదు అన్నట్టుగా రేవంత్‌రెడ్డి పరిస్థితి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఏర్పడుతున్న వ్యతిరేకతను పోగొట్టడానికి ఆయనకు నికరంగా ఏడాది మాత్రమే సమయం మిగిలి ఉంది. చివరి సంవత్సరంలో ఎన్ని విన్యాసాలు చేసినా ప్రజాభిప్రాయం మారదు.

తాను బలపడుతూ, పార్టీ కూడా బలపడేలా చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌పైన పడింది. కొండా సురేఖ ఎపిసోడ్‌లో పార్టీ అధిష్ఠానం అండగా నిలబడటం రేవంత్‌కు ఒకింత ఊరట కలిగించే అంశమే.

తెలుగునాట రెండో పర్యాయం అధికారంలోకి రావడం అంత ఆషామాషీ కాదు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర రెడ్డి, రాష్ట్రం విడిపోయిన తర్వాత కేసీఆర్ మాత్రమే రెండో పర్యాయం అధికారంలోకి రాగలిగారు.

పార్టీ ఏదైనా మొత్తం యంత్రాంగం ఒక్కటిగా నిలబడి ముఖ్యమంత్రిని మోసిన సందర్భాలలోనే చంద్రబాబు అయినా, రాజశేఖర రెడ్డి అయినా, కేసీఆర్ అయినా రెండోమారు అధికారంలోకి రాగలిగారు. మొత్తం పార్టీ యంత్రాంగం ముఖ్యమంత్రులను సొంతం చేసుకోని సందర్భాలలో ఇదే నాయకులు ఓడిపోయారు.

ముఖ్యమంత్రి రేవంత్ మళ్లీ అధికారంలోకి రావాలంటే ముందుగా మొత్తం కాంగ్రెస్ పార్టీ ఆయనను సొంతం చేసుకోవాలి. కార్యకర్తల నుంచి నాయకుల వరకు అందరూ రేవంత్ నాయకత్వానికి జై కొట్టాలి. అలా అందరూ తన నాయకత్వాన్ని ఆమోదించేలా చేసుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌పైన కూడా ఉంటుంది. కాంగ్రెస్ అధిష్ఠానం అండదండలు కూడా ఉన్నందున తనను తాను బలమైన నాయకుడిగా తీర్చిదిద్దుకోవడానికి రేవంత్‌కు ఇదొక సదవకాశం.

కాంగ్రెస్‌లో గ్రూపులు ఉండటం చూసి ఆశ్చర్యపోకూడదు. లేకపోతే ఆశ్చర్యపోవాలి. ఎన్నికల్లో గెలవడానికి సామాజిక సమీకరణలు మాత్రమే సరిపోవు. మొత్తంగా ప్రజల్లో సానుకూల అభిప్రాయం ఏర్పడాలి. అదే సమయంలో సీఎం ఎవరైనా వారి నాయకత్వం పట్ల ప్రజల్లో కూడా విశ్వాసం ఏర్పడాలి.

రేవంత్ కూడా సీఎంగా ఐదేళ్లపాటు కొనసాగి పూర్తి కాలం పదవిలో ఉంటారని అనడంలో ప్రస్తుతానికి సందేహం లేదు. కాంగట?్రస్‌లో ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండటమే ఒక రికార్డు. అలాంటిది రెండో పర్యాయం పార్టీని గెలిపించుకొని అధికారంలో కొనసాగడం గొప్ప విషయమే అవుతుంది.

పార్టీలోని అన్ని గ్రూపులను తన వైపునకు మళ్లించుకొని అందరూ రేవంత్ గ్రూపు మాత్రమే అని రుజువు చేసుకోగలిగినప్పుడే ఆయన శక్తి సామర్థ్యాలు వెల్లడవుతాయి. రాజకీయ ప్రత్యర్థుల నుంచి ఎదురయ్యే దాడుల నుంచి తప్పించుకొని బలంగా నిలబడే వారే నిజమైన నాయకుడిగా ఆవిష్కృతుడవుతారు.

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో కొండా సురేఖ వ్యవహారం టీ కప్పులో తుపానుగా చల్లబడిపోతుందా? లేక మునుముందు కొత్త సవాళ్లకు దారి తీస్తుందా? ఇది ఇప్పటికిప్పుడు చెప్పలేని పరిస్థితి. సురేఖ ఎపిసోడ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ హైకమాండ్ వద్ద తన మాట నెగ్గించుకుని... ఆమెను బర్తరఫ్ చేసి పార్టీలో--ప్రభుత్వంలో తన పట్టు పెంచుకున్నట్టు కనిపిస్తున్నారు. కానీ, సవాళ్లు మాత్రం తొలగిపోలేదు. తెలంగాణ కాంగ్రెస్ పైకి ఒక్కటిగా కనిపిస్తున్నా అంతర్గతంగా మూడు గ్రూపులుగా ఉంది. ఇప్పటి వరకు అచ్చ కాంగ్రెస్, పచ్చ కాంగ్రెస్ అని రెండు గ్రూపులు ఉండగా... ఇప్పుడు రాజశేఖరరెడ్డి వర్గం కూడా తెర మీదకు వచ్చింది. పార్టీలో ప్రత్యర్థులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పచ్చ కాంగ్రెస్ ప్రతినిధిగా అభివర్ణిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన వారిని పచ్చ కాంగ్రెస్ వాళ్లు అని అంటున్నారు. అయితే, తెలంగాణ ఏర్పడిన తర్వాత అచ్చ కాంగ్రెస్ నాయకులుగానీ, రాజశేఖరరెడ్డి వర్గంగానీ పార్టీని అధికారంలోకి తీసుకురాలేకపోయారు. చివరకు తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన రేవంత్‌రెడ్డి చేతికి పార్టీ పగ్గాలు అప్పగించిన తర్వాత 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ వాస్తవాన్ని గుర్తించిన కాంగ్రెస్ అధిష్ఠానం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఎన్ని ఫిర్యాదులు అందినా ఆయా సందర్భాలలో అండగా నిలిచింది. తాజాగా సురేఖ ఉదంతంలో కూడా ముఖ్యమంత్రి అభిప్రాయానికి విలువ ఇచ్చి ఆమెను బర్తరఫ్ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే... పార్టీ అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకునే ముందు దాన్ని అడ్డుకొనే ప్రయత్నాలు జరగకపోలేదు. ఇద్దరు ముగ్గురు మంత్రులు బర్తరఫ్ నిర్ణయాన్ని అడ్డుకొనే ప్రయత్నం చేశారు. ఈ కారణంగానే నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరిగింది. కొండా సురేఖను బర్తరఫ్ చేయనిస్తే రేవంత్‌రెడ్డి బలపడతారన్న ఉద్దేశంతోనే ఈ ప్రయత్నాలు జరిగినట్టు చెబుతున్నారు. అయితే, రేవంత్‌రెడ్డిని కాదనుకునే పరిస్థితి లేకపోవడం, జరిగిన దానిపట్ల విచారం వ్యక్తం చేయడానికి కూడా సురేఖ సిద్ధపడకపోవడంతో పార్టీ అధిష్ఠానం బర్తరఫ్ నిర్ణయం వైపు మొగ్గు చూపాల్సి వచ్చింది.

### ఏమిటి కారణం...

ఈ మొత్తం వ్యవహారంలో కొండా సురేఖది స్వయం కృతాపరాధమా? లేక వ్యూహాత్మకమా? అన్నది ఇప్పుడే చెప్పలేం. గతంలో కూడా ఆమె దుందుడుకు నిర్ణయాలు తీసుకున్న చరిత్ర ఉంది. కాంగ్రెస్ పార్టీలో ఆమె రాజశేఖరరెడ్డి అనుచరురాలిగా ఉండేవారు. రాజశేఖరరెడ్డి మరణానంతరం జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నారు. అయితే, పార్టీ అధిష్ఠానం మాత్రం కొణిజేటి రోశయ్యను ముఖ్యమంత్రిగా ఎంపిక చేసింది. దీంతో కినుక వహించిన సురేఖ మంత్రి పదవికి రాజీనామా చేసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే తెలంగాణ వాదులు జగన్మోహన్‌రెడ్డిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఫలితంగా తెలంగాణలో ఆయన తన దుకాణం మూసుకోవలసి వచ్చింది. దీంతో సురేఖ తెలంగాణ రాష్ట్ర సమితిలో చేరి ఎమ్మెల్యే అయ్యారు. అక్కడ కూడా ఇమడలేక ఆమె మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో మూడు గ్రూపులలో ఒకటైన రాజశేఖరరెడ్డి వర్గం విషయానికి వద్దాం! రాజశేఖరరెడ్డిని విపరీతంగా అభిమానించిన వర్గం తమ ప్రాంతానికి చెందిన రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని మాత్రం అంగీకరించలేకపోతోంది. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ వర్గంలో ఉన్నవారందరికీ ఏవో మేళ్లు చేశారని చెబుతున్నారు. ఈ కారణంగానే వారందరూ వైఎస్ఆర్‌ను అభిమానిస్తూ వచ్చారు. ఆర్థిక ప్రయోజనాలు కలిగించే మేళ్లు చేయడంతో పాటు రాజశేఖరరెడ్డి ఆప్యాయత ప్రదర్శించేవారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి విషయంలో ఆప్యాయతతోపాటు ఆర్థిక ప్రయోజనం కలిగించే మేళ్లు కరువయ్యాయని చెబుతున్నారు. ఈ కారణంగానే తెలంగాణలో రాజశేఖరరెడ్డి రాజ్యం తెస్తామన్న మాటలు వినిపిస్తున్నాయి. ఇక ఒరిజినల్ కాంగ్రెస్ పార్టీ విషయానికి వద్దాం! గత వారం నేను చెప్పినట్టుగా తెలంగాణ కాంగ్రెస్‌లో నాయకులు బలంగా ఎదగకుండా రాజశేఖరరెడ్డి అడ్డుకున్నారు. ఈ కారణంగానే 2014 ఎన్నికల్లో పార్టీ గెలుస్తుందో లేదో తెలియకపోయినా అనేక మంది ముఖ్యమంత్రి అభ్యర్థులుగా తెరమీదకు వచ్చారు. ఫలితంగా ఎన్నికల్లో పార్టీకి సారథ్యం వహించగల నాయకులు కరువయ్యారు. చివరకు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసినా కాంగ్రెస్ మాత్రం అధికారానికి ఆమడ దూరంలోనే ఆగిపోయింది. గాలి వాటంగా పార్టీ అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి కావాలనుకున్నారే కానీ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఎవరూ బాధ్యత తీసుకోలేకపోయారు. ఈ నేపథ్యంలోనే రాహుల్‌గాంధీ పార్టీ పగ్గాలను రేవంత్‌రెడ్డికి అప్పగించారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో పచ్చ కాంగ్రెస్ అని ప్రత్యర్థులు పిలుచుకొనే మూడో వర్గం అవతరించింది. ఈ వర్గంలోని వారందరూ అప్పటి వరకూ ఏక నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీలో ఉండి వచ్చినవారే. చంద్రబాబు నాయకత్వంలో ఆయన సలహాలు సూచనల మేరకు పనిచేసినవారు కనుక కాంగ్రెస్ సంస్కృతిని ఒంటబట్టించుకోలేకపోయారు. ఇప్పటికీ కాంగ్రెస్‌లోని ఈ వర్గానిది అదే పరిస్థితి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విషయమే తీసుకుందాం. ఇప్పుడు ఉన్న మంత్రులందరికంటే ఆయనే సీనియర్. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు, కేసీఆర్ మంత్రివర్గాలలో ఆయన పనిచేశారు. అయితే, కాంగ్రెస్ పార్టీలో మాత్రం ఆయనను జూనియర్‌గానే చూస్తారు. తుమ్మలకు కూడా కాంగ్రెస్ అధిష్ఠానం అంటే ఏమిటో, వారితో ఎలా మెలగాలో తెలియదు. రేవంత్‌రెడ్డి కారణంగానే ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి సీతక్కది కూడా ఇంచుమించు ఇదే పరిస్థితి. కాంగ్రెస్ సంస్కృతి ఒంటబట్టకపోవడం వల్ల ఈ వర్గం ఒకింత అసౌకర్యానికి గురవుతోంది. ఇప్పుడు ఈ మూడు వర్గాలనూ సమన్వయం చేసుకుంటూ తాను బలపడుతూ, పార్టీ కూడా బలపడేలా చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పైన పడింది.

### రెండోసారి ఈజీ కాదు...

సురేఖ ఎపిసోడ్‌లో పార్టీ అధిష్ఠానం అండగా నిలబడటం రేవంత్‌రెడ్డికి ఒకింత ఊరట కలిగించే అంశమే. అయినప్పటికీ ఇల్లు అలకగానే పండుగ కాదు అన్నట్టుగా ఆయన

## అమెరికా నుంచి బంగారం ఎందుకు తరలిపోతోంది?

యుద్ధాల అనిశ్చితి కొనసాగుతుండగానే... వివిధ దేశాలు అమెరికా నుంచి బంగారాన్ని తరలిస్తుండటం అంతర్జాతీయంగా చర్చనీయాంశమవుతోంది. గత వారం నెదర్లాండ్స్ ఇప్పటిదాకా తాను అమెరికాలో దాచుకున్న బంగారాన్ని లండన్‌కు బదిలీ చేయటం తాజా పరిణామం. కారణమేంటంటే... 'సంక్లిష్ట సంక్షోభానికి ముందస్తు తయారీ' అంటూ నెదర్లాండ్స్ బదులివ్వటం ఆసక్తికరం! ఇంతకూ ఏం జరుగుతోంది? ఎందుకని అమెరికా నుంచి బంగారాన్ని వివిధ దేశాలు తరలిస్తున్నాయి?

నెదర్లాండ్స్ ఒక్కటే కాదు... కొద్దికాలం ముందు ఫ్రాన్స్, జర్మనీ తదితర దేశాల కేంద్ర బ్యాంకులు కూడా ఎన్నాళ్లుగానో అమెరికాలో భద్రపరుచుకున్న టన్నుల కొద్దీ బంగారాన్ని తరలించాయి. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఐరోపా దేశాలు ఈ నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలను నిపుణులు విశ్లేషిస్తున్నారు. సమీప భవిష్యత్తులో ఏదైనా తీవ్రమైన ఆర్థిక కుదుపును ఈ దేశాలు ఊహిస్తున్నాయా అనే సందేహమూ కలుగుతోంది.

యుద్ధాలు జరుగుతున్నప్పుడు, వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్నప్పుడు అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఒడుదుడుకులను తట్టుకోవడానికి బంగారాన్ని విక్రయించడం, తనఖాపెట్టడం వంటి చర్యలను వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు అనుసరిస్తుంటాయి. ద్రవ్యలభ్యతను పెంచుకొని ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కడానికి కూడా ఇది దోహదపడుతుంది. అయితే నెదర్లాండ్స్ చెప్పినట్లు... సంక్లిష్ట ఆర్థిక సంక్షోభం వస్తుందా అనే ప్రశ్నకు ఇప్పటికిప్పుడు అలాంటి పరిస్థితులు లేవన్నదే నిపుణుల మాట. అయినా ... ప్రస్తుత ప్రపంచ భౌగోళిక, రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఆయా దేశాలు ముందు జాగ్రత్త పడుతున్నాయన్నది మాత్రం స్పష్టమవుతోంది. వివిధ దేశాల్లోని సాయుధ ఘర్షణలు ముఖ్యంగా రష్యా–ఉక్రెయిన్, అమెరికా–ఇరాన్ యుద్ధాలు ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని దేశాలపైనా వాణిజ్య సుంకాలను విధిస్తుండడంతో ఆర్థికపరమైన అనిశ్చితీ సర్వత్రా తలెత్తుతోంది. చిరకాల మిత్ర దేశం, పొరుగునున్న కెనడాపై కూడా ట్రంప్ కాలుదువ్వుతున్న పరిస్థితుల్లో.. అమెరికాలో ప్రచ్ఛన్న యుద్ధ కాలం నుంచి నిల్వ చేసిన బంగారంపై ఐరోపా దేశాలు వ్యూహాలను మార్చుకుంటున్నాయి. సుదూరంగా కాకుండా తమకు దగ్గర్లోకి తమ బంగారాన్ని చేర్చుకుంటున్నాయి. అందుకే... అమెరికా, కెనడాలలో నిల్వ చేసిన 313 టన్నుల బంగారంలో సుమారు 86 టన్నులను నెదర్లాండ్స్ లండన్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ ఖజానాకు చేర్చింది. న్యూయార్క్ నుంచి 111 టన్నుల బంగారాన్ని తరలించినట్లు జర్మనీకి చెందిన బుందెష్‌బ్యాంక్ కొన్ని నెలల క్రితం వెల్లడించింది. ఫ్రాన్స్ నుంచి కూడా ఇటువంటి ప్రకటనే వెలువడింది. ఇవన్నీ లండన్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు ఆ మొత్తాన్ని తరలించడం గమనార్హం.

బంగారం నిల్వలకు ప్రపంచంలోనే అత్యంత సురక్షిత స్థావరంగా లండన్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు శతాబ్దాలుగా పేరుంది. సెంట్రల్ లండన్‌లో కట్టుదిట్టమైన భద్రత కలిగిన భారీ నేలమాళిగలు దీనికి ఉన్నాయి. ఇక్కడ నిల్వచేసుకున్న బంగారాన్ని మరో చోటుకు తరలించాల్సిన అవసరం లేకుండానే ఏ క్షణంలోనైనా విక్రయించుకోవచ్చు. కేవలం ఖాతాలో సర్దుబాటుతో బంగారాన్ని కొనుగోలు చేయవచ్చు. విక్రయించవచ్చు. బంగారం క్రయవిక్రయాలకు లండన్ అన్నివిధాలా అత్యుత్తమమైన ప్రదేశమని వివిధ దేశాలు భావిస్తున్నందునే అమెరికా నుంచి వ్యూహాత్మకంగా నిల్వలను తరలిస్తున్నాయి. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ ఖజానాలో 5వేల టన్నుల వరకు బంగారాన్ని నిల్వ చేసే సదుపాయం ఉందని సమాచారం.

## బీఆర్ఎస్ వైఖరి మారకపోతే..

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో పేదలకు రేషన్ కార్డు కూడా ఇవ్వకుండానే దౌర్భాగ్య పాలన పదేళ్లపాటు సాగింది. బీఆర్ఎస్, భాజపా కార్యకర్తలకు రేషన్ కార్డు రాలేదా? సన్నబియ్యం తీసుకోవట్లేదా? రెండున్నరేళ్లలోనే రైతుల ఖాతాల్లోకి రూ. 1.60 లక్షల కోట్లు జమచేశాం. మళ్లీ ఎన్నికలకు వెళ్లేలోపు.. ఆరు గ్యారంటీలను సంపూర్ణంగా అమలు చేస్తాం. రూ. 8 లక్షల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ మాకు అప్పగించారు. ఆ అప్పుపై అసలు, వడ్డీ చెల్లిస్తూ.. సంక్షేమం కూడా అమలు చేస్తున్నాం. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా గ్రేడ్ 1 నియామకాలు జరగలేదు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకుడి వైఖరి మారకుంటే.. మరో పదేళ్లు కూడా వాళ్లు రోడ్ల మీదనే ఉంటారు" అని శ్రీధర్ బాబు అన్నారు.

## గ్రామ నిధులు నేరుగా సర్పంచులకే అందేలా త్వరలో కొత్త బిల్లు: మంత్రి సీతక్క

మొదటి పేజీ తరువాయి

గచ్చిబౌలి: గ్రామ సర్పంచులు నిత్యం ఎదురయ్యే ఒత్తిళ్లు, విమర్శలను తట్టుకొని మానసిక స్థైర్యంతో ముందుకు సాగాలని మంత్రి సీతక్క అన్నారు. నిధుల విడుదల విషయంలో ఉప సర్పంచుల చెక్ పవర్‌కు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో వచ్చిన చట్టంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఈ అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి తెలిపారు. గ్రామాలకు అభివృద్ధి నిధులు ఆగిపోకుండా.. నిధులు నేరుగా సర్పంచులకే అందేలా త్వరలో అసెంబ్లీలో కొత్త బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఆదివారం గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో సర్పంచుల కోసం 'సమర్థవంతమైన నాయకత్వం ద్వారా గ్రామ ప్రగతి' అనే అంశంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయడమే కాదు ప్రజల్లో నైతిక విలువలను పెంపొందించే దిశగా సర్పంచులు నాయకత్వం వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 9 రకాల ఆదర్శ గ్రామ అంశాలను సర్పంచులు ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. మానసిక ఆరోగ్యం పరిరక్షణ పట్ల సర్పంచులకు అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాజయోగిని బ్రహ్మకుమారి సంతోష్ దీదీ మాట్లాడుతూ.. సర్పంచులు నిస్వార్థంగా ప్రజాసేవ చేయాలని అన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, శాంతి సరోవర్ డైరెక్టర్ కుల్‌దీప్ తదితరులు పాల్గొన్నారు.

## వెలిగొండ ఫీడర్ కెనాల్‌లో యువకుల గల్లంతుపై మంత్రుల ఆరా

మొదటి పేజీ తరువాయి



మార్కాపురం అర్బన్: మార్కాపురం జిల్లా వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్‌లో ఇద్దరు యువకుల గల్లంతుపై మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడారు. కటకాని పల్లెకు చెందిన ఇద్దరు యువకులు గల్లంతుపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యువకుల మృతదేహాల గాలింపు చర్యలు విస్తృతం చేయాలని ఆదేశించారు. ఫీడర్ కెనాల్‌లో నీరు వేగంగా వస్తుంది కాబట్టి, ఎవరూ కూడా నీళ్లలో దిగవద్దని తెలిపారు. నల్లమల సాగర్‌లో ఎగుడు దిగుడులు ఉండడంతో, ఎక్కడ ఎంత లోతు ఉంటుందో అంచనా వేయడం కష్టం కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫీడర్ కెనాల్, నల్లమల సాగర్ దగ్గర పోలీస్, రెవెన్యూ అధికారులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

మంత్రి గొట్టిపాటి ఆరా

వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్‌లో యువకులు గల్లంతుపై మంత్రి గొట్టిపాటి రవి ఆరా తీశారు. ఎస్పీ, అధికారులతో మాట్లాడారు. యువకుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. గత రెండు రోజుల నుంచి డ్రోన్‌ల ద్వారా గాలింపు చర్యలు చేపట్టినట్లు మంత్రికి అధికారులు తెలిపారు. ఫీడర్ కెనాల్ వెంట పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని ఎస్పీని మంత్రి కోరారు.

## గాల్లో ఉండగా సాంకేతిక సమస్య.. విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

మొదటి పేజీ తరువాయి

టేకాఫ్ అయిన కొంత సేపటికే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో వెనక్కి తిరిగి వచ్చింది. ఈ ఘటన బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. విమానాశ్రయ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. వర్జిన్ అట్లాంటిక్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం ఆదివారం ఉదయం 8.20 గంటలకు లండన్‌కు బయల్దేరింది.

టేకాఫ్ అయిన కొద్ది సేపటికే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు గుర్తించిన పైలట్లు విమానాశ్రయ అధికారులను అప్రమత్తం చేశారు. విమానాన్ని అరగంటకు పైగా గాలిలో చక్కర్లు కొట్టించారు. అనంతరం వెనక్కి తీసుకువచ్చి విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. ఘటన జరిగిన సమయంలో విమానంలో సిబ్బంది సహా మొత్తం 270మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించి, విమానాన్ని తనిఖీలకు తరలించారు. ఘటనపై డీజీసీఏ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

## ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి.. కేసీఆర్ దిశానిర్దేశం

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కేసీఆర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలకు అందరూ తప్పకుండా హాజరుకావాలన్నారు. శాసనసభ, మండలిలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలి. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి. కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఉభయసభల్లో ఎండగట్టాలన్నారు.

సీఎం రేవంత్ అసెంబ్లీలో, బయట బూతులు మాట్లాడుతున్నారని కేసీఆర్ ఫైర్ అయ్యారు. పాలన చేతకాక ఈ తరహాలో వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన అట్టర్‌ఫ్లాప్ అని అన్నారు. కాంగ్రెస్ థర్డ్ క్లాస్ పాలన కొనసాగిస్తోంది. కాంగ్రెస్ పోవడం ఖాయమని అర్థమైంది. రేవంత్ చిల్లర మాటలు మాట్లాడుతున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం. ఈ విషయం ఆ పార్టీ నేతలకు అర్థమైంది. అందుకే ఈ దోపిడీ చేస్తున్నారు. స్పీకర్ పక్షపాత వైఖరి అప్రజాస్వామికమన్నారు. సభలో స్పీకర్ పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని కేసీఆర్ పేర్కొన్నారు.

బూతుల వీరుడితో చర్చకు అసెంబ్లీకి రమ్మంటున్నారు. నా చావు కోరుతూ పదే పదే మాట్లాడుతున్నారు. రాష్ట్రప్రభుత్వం అన్ని రంగాల్లో ఘోరంగా విఫలమైంది. తెలంగాణ రైజింగ్ కాదు.. డౌన్ ఫాల్ అవుతోందన్నారు కేసీఆర్ .

## హెల్త్ కార్డుల విషయంలో సీఎం నిర్ణయం సంతోషపెట్టింది: ఏపీ జేఏసీ

మొదటి పేజీ తరువాయి

అమరావతి: సెప్టెంబర్ 5న జరిగిన చర్చల్లో సమస్యలపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని ఏపీ జేఏసీ ఛైర్మన్ విద్యాసాగర్ తెలిపారు. చర్చలకు సంబంధించిన వివరాలను విద్యాసాగర్ మీడియాకు వెల్లడించారు. "ఏపీజేఏసీ అతిపెద్ద వ్యవస్థ. అయితే, హెల్త్ కార్డు వ్యవస్థ సరిగా పనిచేయట్లేదు. హెల్త్ కార్డు విధానంపై సీఎంతో సమావేశంలో పట్టుబట్టాం. ఆస్పత్రుల్లో చెల్లింపులు సరిగా లేకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. హెల్త్ కార్డుల విషయంలో సీఎం నిర్ణయం చాలా సంతోషంగా ఉంది.

## ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యకు యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫ్యాన్‌కు ఉరివేసుకుంటుండగా కుటుంబసభ్యులు గది తలుపులు పగులగొట్టి ఆమెను కాపాడారు. ప్రస్తుతం మాధురి రాథోడ్‌కు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు సమాచారం.

పెళ్లి చేసుకుంటానని చెప్పి ఫోక్ డ్యాన్సర్ ఈశ్వర్‌సాయి తనను మోసం చేశాడని.. ఫిర్యాదు చేసినా అతడిపై చర్యలు తీసుకోలేదని మాధురి ఆరోపిస్తోంది. ఈ క్రమంలోనే ఆమె మనస్తాపానికి గురై ఆత్మహత్యకు యత్నించినట్లు తెలుస్తోంది.

## నాపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌ను అరెస్ట్ చేయాలి: కవిత



బంజారాహిల్స్: సామాజిక మాధ్యమాల్లో తనపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన చేసిన కానిస్టేబుల్‌ను సర్వీస్ నుంచి రిమూవ్ చేయకుండా రాష్ట్ర డీజీపీ సస్పెండ్‌తోనే సరిపెట్టారని తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత (ఖుజఙ్ష్ఖు) ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడిపై కేసు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే చర్యలు చేపట్టకుంటే.. అంతర్జాతీయ వేదికలపై ప్రభుత్వం తీరును ఎండగడతానని హెచ్చరించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణసేన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు.

మహిళలపై అసభ్యంగా మాట్లాడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు చెబుతున్నాయని, అవి డీజీపీకి తెలియదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా.. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు కల్లలు గానే మిగిలిపోయాయన్నారు. బీసీల కోసం ధర్నాలు చేస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పడం పెద్ద జోక్ అని కవిత అన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆక్షేపించారు. మాజీ మంత్రి కొండా సురేఖ అంశం ఆ పార్టీ అంతర్గత విషయమన్నారు.

# ప్రమాదాలకు నిలయంగా చించినాడ వంతెన!

- వరుస ఘటనలు జరుగుతున్నా నివారణ చర్యలు శూన్యం
- రక్షణ కవచం లేకపోవడమే ప్రమాదాలకు కారణమా
- భద్రతా ఏర్పాట్లు ఎక్కడ?
- ప్రయాణికుల్లో పెరుగుతున్న ఆందోళన

**ఎలమంచిలి సెప్టెంబర్ 06**
**జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**





చించినాడ ఉభయ గోదావరి జిల్లాల మధ్య కీలక రవాణా మార్గంగా ఉన్న చించినాడ వంతెన ప్రస్తుతం ప్రమాదాలకు నిలయంగా మారుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల వంతెనపై జరిగిన విషాద ఘటనలు ప్రజలను కలవరపెడుతున్నాయి. తాజాగా సెప్టెంబర్ 5న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వంతెనపై నుంచి గోదావరిలోకి దూకిన ఘటన మరోసారి ఈ వంతెన వద్ద భద్రతా చర్యలపై ప్రశ్నలు లేవనెత్తింది.

చించినాడ వంతెన ఉభయ గోదావరి జిల్లాల ప్రజల రాకపోకలకు అత్యంత కీలకమైన మార్గం. ఏడాది పాటు మరమ్మతుల కోసం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిన తర్వాత ఇటీవలే వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. అయితే వంతెనపై కొన్ని పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, బీటీ రహదారి పనులు కూడా పూర్తి కావాల్సి ఉందని ఇటీవల వార్తలు వెల్లడించాయి.

**భద్రతా చర్యలు చేపట్టాలి**

వంతెనపై ప్రమాదకర ఘటనలను నివారించేందుకు అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా వంతెనపై నిఘా కెమెరాలు, నిరంతర పోలీసు పర్యవేక్షణ, అత్యవసర సహాయక వ్యవస్థలు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న వారిని గుర్తించి వెంటనే స్పందించేందుకు వంతెనపై అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లు, సీసీ కెమెరాలు, భద్రతా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే, అవి జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అత్యవసరమని అంటున్నారు.

**అధికారుల స్పందన ఎప్పుడో?**

ఇటీవల చోటుచేసుకుంటున్న ఘటనల నేపథ్యంలో చించినాడ వంతెన భద్రతపై సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రవాణా భద్రతకు సంబంధించిన ఇతర ప్రాంతాల్లో ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి సూచిక బోర్డులు, వేగ నియంత్రణలు, రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులు సూచిస్తున్న నేపథ్యంలో, చించినాడ వంటి కీలక వంతెన వద్ద కూడా సమగ్ర భద్రతా ప్రణాళిక అవసరమనే డిమాండ్ వినిపిస్తోంది.

**చించినాడ వంతెన గోదావరి ఒడ్డున అభివృద్ధికి ప్రతీక**

**దిండి--చించినాడలను కలిపిన చారిత్రక వారధి...**

**రెండు ప్రాంతాల ప్రజల జీవితాల్లో కొత్త మార్పుకు నాంది**

విశాలమైన వశిష్ఠ గోదావరి ప్రవాహాన్ని దాటడం ఒకప్పుడు ఈ ప్రాంత ప్రజలకు పెద్ద సవాలే. నదికి ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలు రవాణా కోసం పడవలు, ఇతర పరిమిత మార్గాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉండేది. అలాంటి పరిస్థితుల్లో పశ్చిమ గోదావరి ప్రాంతంలోని చించినాడను కోనసీమ వైపు దిండితో కలిపే వంతెన ఆలోచన ఈ ప్రాంత అభివృద్ధికి కొత్త దిశను చూపింది.

వశిష్ఠ గోదావరిపై చించినాడ వద్ద వంతెన నిర్మాణానికి 1990-91లోనే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అప్పటి బడ్జెట్ పత్రాల ప్రకారం ఈ ప్రధాన వంతెన నిర్మాణానికి రూ.18 కోట్ల వ్యయంతో అనుమతి లభించింది.

**1995లో నిర్మాణానికి శ్రీకారం**

తర్వాతి కాలంలో దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి చొరవతో ఈ వంతెన నిర్మాణానికి ఊతం లభించింది. 1995లో నిర్మాణ పనులు ప్రారంభమై, భీమవరం ఆర్‌అండ్‌బీ స్పెషల్ డివిజన్ ఆధ్వర్యంలో పనులు కొనసాగాయి. సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర నిర్మించిన ఈ ప్రీ-స్ట్రెస్‌డ్ కాంక్రీట్ వంతెన 2001 నాటికి పూర్తయి ప్రజల రాకపోకలకు అందుబాటులోకి వచ్చింది.

**రెండు తీరాలను కలిపిన అభివృద్ధి వారధి**

చించినాడ--దిండి వంతెన అందుబాటులోకి రావడంతో పశ్చిమ గోదావరి, కోనసీమ ప్రాంతాల మధ్య ప్రత్యక్ష రహదారి అనుసంధానం బలపడింది. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, వ్యాపార కార్యకలాపాలు, ఉద్యోగులు, విద్యార్థుల రోజువారీ ప్రయాణాలకు ఈ వంతెన ఎంతో ఉపయోగపడింది. గతంలో నది దాటేందుకు ఎదురైన ఇబ్బందులు తగ్గి, ప్రజల ప్రయాణ సమయం కూడా ఆదా అయ్యింది.

**కోనసీమ అందాలకు కొత్త మార్గం**

దిండి ప్రాంతం గోదావరి నది ఒడ్డున ఉన్న ప్రకృతి సౌందర్యం, కొబ్బరి తోటలు, పచ్చని వరి పొలాలతో ప్రసిద్ధి చెందింది. చించినాడ వంతెన ద్వారా ఈ ప్రాంతాలకు రహదారి అనుసంధానం మరింత మెరుగై, పర్యాటక రంగానికి కూడా ఉపయోగకరంగా మారింది. కాలక్రమంలో పెరిగిన ట్రాఫిక్... కొత్త సవాళ్లు రెండు దశాబ్దాలకు పైగా ప్రజల రాకపోకలకు సేవలందిస్తున్న చించినాడ వంతెనపై కాలక్రమేణా వాహనాల రద్దీ పెరిగింది. ఇటీవల వంతెన నిర్మాణ భాగాలకు మరమ్మతుల అవసరం ఏర్పడడంతో రాకపోకలపై ఆంక్షలు విధించాల్సిన పరిస్థితులు కూడా ఎదురయ్యాయి. ఈ వంతెనపై గిర్డర్లు, బేరింగ్‌ల పరిస్థితిపై అధికారులు మరమ్మతు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని గతంలో నివేదికలు వెలువడ్డాయి.

**చించినాడ వంతెన కేవలం నిర్మాణం కాదు... ప్రజల అనుబంధం**

చించినాడ వంతెన కేవలం కాంక్రీట్ నిర్మాణం మాత్రమే కాదు. గోదావరికి ఇరువైపులా ఉన్న ప్రజల మధ్య ఏర్పడిన అనుబంధానికి ప్రతీక.

# విజ్ఞాన్ విద్యాలయంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- కృష్ణుడి వేషంలో చిన్నారుల సందడి.. ఉపాధ్యాయులకు సన్మానం

**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 6 (జనసముద్రం)**



శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని విజ్ఞాన్ విద్యాలయంలో ఆదివారం ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి చిన్నారుల్లో ఆధ్యాత్మికత, సాంస్కృతిక విలువలను పెంపొందించేలా వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారులు శ్రీకృష్ణుడి బాల్య ఘట్టాలను ప్రతిబింబించేలా చేసిన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, భక్తిగీతాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల కృష్ణవేషధారణతో పాఠశాల ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వేడుకల్లో భాగంగా విద్యార్థులతో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారులను ప్రోత్సహించారు. అలాగే ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు నడిపెల్లి ప్రభాకర్ రావు, రాధా సుధీర్ రావు, ఉపాధ్యాయులు గీత, షెహనాజ్, రాశి, శ్వేత, అసిఫా తదితరులు పాల్గొన్నారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రుల సహకారంతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి.

# నాంపల్లి మండలానికి గర్వకారణం.. వైద్య విద్యలో వైష్ణవి సత్తా

**జన సముద్రం న్యూస్ । నాంపల్లి, నల్లగొండ । సెప్టెంబర్ 6**



నాంపల్లి: నల్గొండ జిల్లా నాంపల్లి మండలం మల్లపురాజుపల్లి గ్రామానికి చెందిన వట్టికోటి రాములు--ఇందిర దంపతుల కుమార్తె వట్టికోటి వైష్ణవి ప్రతిభ చాటుకుంది. ఇంటర్మీడియట్‌లో జీవశాస్త్రం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం విభాగంలో 963 మార్కులు సాధించిన వైష్ణవి, పునః నిర్వహించిన నీట్--2026 పరీక్షలో 413 మార్కులు సాధించింది. ఆల్ ఇండియా స్థాయిలో 2,41,664వ ర్యాంకు తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 6,301వ ర్యాంకు వెనుకబడిన తరగతుల ఏ కేటగిరీలో 239వ ర్యాంకు సాధించింది. దీంతో మొదటి విడత కౌన్సెలింగ్‌లో కామారెడ్డిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందింది. నాంపల్లి మండలంలోని మారుమూల ప్రాంతమైన మల్లపురాజుపల్లి గ్రామం నుంచి తొలిసారిగా వైద్య విద్యలో సీటు సాధించడం ఎంతో గర్వకారణమని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. వెనుకబడిన తరగతుల ఏ కేటగిరీ నుంచి వైద్య విద్యలో సీటు సాధించడం ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. వైష్ణవి తల్లిదండ్రులు వృత్తిరీత్యా ఉద్యోగులు. తండ్రి సిద్దిపేట జిల్లాలో సహాయ ప్రాజెక్టు అధికారిగా తల్లి ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం వారు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చనే దానికి వైష్ణవి విజయం నిదర్శనమని గ్రామస్తులు పేర్కొన్నారు. వైష్ణవి సాధించిన విజయంపై గ్రామస్తులు బంధువులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు

# టీచర్స్ డే వేడుకలు ఘనంగా చింత పల్లి మండలం లో

**జిల్లా ఇంచార్జి జన సముద్రం న్యూస్ తేది సెప్టెంబర్ 6**





అల్లూరి జిల్లా

జిల్లా పాడేరు నియోజకవర్గం చింతపల్లి మండలం జాజులపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాజులపాలెం ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఈ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు.

జాజులపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గురుపూజోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలంటే ప్రస్తుతం కష్టపడి చదవాలని సూచించారు. చదువుతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, జీవితంలో మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం కృషి చేయాలని విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించారు. భవిష్యత్తులో మీరందరూ ఉన్నతమైన, ప్రముఖ స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించిన ఉపాధ్యాయులు... విద్యార్థులు గొప్ప స్థాయికి చేరుకోవడమే తమకు వారు ఇచ్చే నిజమైన గురుదక్షిణ అని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల మాటలు విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపగా... గురుపూజోత్సవ వేడుకలు జాజులపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఘనంగా ముగిశాయి.

# ప్రజా సమస్యలు పరిష్కరించాల్సింది ప్రభుత్వమే.. నిరసనలు చేయడం కాదు

**బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ సెక్రటరీ సామ మహేందర్ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి శ్రీకాంత్ గుప్తా( సెప్టెంబర్ 6) జనసముద్రం**



ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వమే నిరసనలకు పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సెక్రటరీ సామ మహేందర్ రెడ్డి విమర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న ప్రభుత్వానిదేనని అన్నారు. అయితే సమస్యలను పరిష్కరించకుండా రాజకీయ నిరసనలకు పిలుపునివ్వడం ప్రజలను అయోమయానికి గురిచేస్తోందని పేర్కొన్నారు.

“తెలంగాణలో ప్రజా సమస్యలు ఉన్నాయని మీరే అంగీకరిస్తున్నారా? వాటిని పరిష్కరించడంలో మీ ప్రభుత్వం విఫలమైందని మీరే ఒప్పుకుంటున్నారా?” అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సామ మహేందర్ రెడ్డి ప్రశ్నించారు.

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

యువత, రైతులు, మహిళలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని కోరారు.

ముందుగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి.. ప్రజా సమస్యలను పరిష్కరించాలి.. ఆ తర్వాతే రాజకీయ నిరసనల గురించి మాట్లాడాలి అని సామ మహేందర్ రెడ్డి అన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

**మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి**

**పోచమ్మ దేవాలయ ఉత్సవ కమిటీకి 54,116/- విరాళం అందజేత**



ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవడంతో ప్రతి ఒక్కరు మానసిక ప్రశాంతత పొందుతారని కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. ఆదివారం రోజున గ్రామదేవత పోచమ్మ దేవాలయంలో, బోనాల ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించాలని కమిటీ సభ్యులను కోరారు. గ్రామంలో బోనాల ఉత్సవాల నిర్వహణకు పోచమ్మ దేవాలయం ఉత్సవ కమిటీ సభ్యులకు, 54,116/-రూపాయల విరాళాన్ని అందజేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరు దేవాలయాల అభివృద్ధి మరియు మౌలిక వసతుల ఏర్పాటులో భాగస్వాములు కావాలని కోరారు. గ్రామంలో నాలుగు రోజులపాటు జరిగే బోనాల ఉత్సవ కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ సత్యం యాదవ్, సింగల్ విండో చైర్మన్ గంపా వెంకటేష్ గుప్తా, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కంబాల పరమేష్, వార్డు సభ్యులు మాధారం గణేష్ గౌడ్, కమిటీ సభ్యులు చేగూరి రాములు గౌడ్, గూడూరు శేఖర్ రెడ్డి, మాలె మల్లేష్ గౌడ్, వాంకుడావత్ రాంచందర్ నాయక్, గురిగళ్ల రామచంద్రయ్య, మూడ అశోక్, అమృతం పాండు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి నదిలోకి దూకి గల్లంతైన ముగ్గురి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు

**ఎలమంచిలి ఎస్ఐ రాజకుమార్ వెల్లడి**


**సెప్టెంబర్ 6 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**



పాలకొల్లు నియోజకవర్గం యలమంచిలి మండలం చించినాడ వద్ద గోదావరి వంతెనపై నుంచి నలుగురు కుటుంబ సభ్యులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వీరంతా తణుకు పట్టణానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. జాలర్ల సహాయంతో నంబూరి పద్మినిని రక్షించారు. ప్రస్తుతం ఆమెకు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. గల్లంతైన నంబూరి శ్రీనివాసు, ఆయన కుమారుడు ఈశ్వర్, కుమార్తె నిత్య కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని యలమంచిలి ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వంతెన వద్ద భద్రతా చర్యలు చేపడుతున్నామని ఎస్సై తెలిపారు. వంతెనకు ఇరువైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. అలాగే వంతెన వద్ద నిరంతరం పోలీస్ పెట్రోలింగ్, పికెటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందించామని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా అవసరమైన నివారణ చర్యలు చేపడతామని యలమంచిలి ఎస్సై రాజ్‌కుమార్ వెల్లడించారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు తెలిపిన రుద్రాల రవి

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, సెప్టెంబర్ 6;**



Coordination Teams for Local Body Elections (Parliament Constituecy Wise)

| S No | Parliament | Name |
| --- | --- | --- |
| Coordinator | | |
| 1 | Bapatla & Narasaraopet | Sri Vallabhaneni Balashowry |
| Coordination Team | | |
| 2 | Bapatla | Sri Ala Anil Kumar |
| 3 | | Smt Somarowtu Anu Radha |
| 4 | | Sri Matti Bhaskara Rao |
| 5 | Narasaraopet | Sri Sayyad Jilani |
| 6 | | Smt Siva Parvati |
| 7 | | Sri Veeravalli Vamsy |
| Support Team | | |
| 8 | Bapatla | Sri G Malleswara Rao |
| 9 | | Sri Karumuri Anjenesh |
| 10 | | Sri Somisetty Pream Kiran Kumar |
| 11 | | Sri Neerukattu VenkaiahNaidu |
| 12 | | Sri A Prudhvi |
| 13 | | Sri Nagaraju |
| 14 | | Sri Emani Manikantha |
| 15 | Narasaraopet | Sri Shaik Subhani |
| 16 | | Sri Kamisetty Ramesh |
| 17 | | Sri Rudrala Ravi |
| 18 | | Sri Bellamkonda Eswara Rao |
| 19 | | Sri V Prasad Rao |
| 20 | | Sri Thota Haribabu |
| 21 | | Sri Sivvadhi Chiranjeevi |



స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీలో మాచర్ల నియోజకవర్గం నుంచి కోఆర్డినేటర్ బాధ్యతలు అప్పగించిన పవన్ కళ్యాణ్ కి మాచర్ల నియోజకవర్గం అధ్యక్షులు రుద్రాల రవి కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసి, పార్టీ పై నమ్మకంతో నాకు అప్పగించిన ఈ బాధ్యతను ఒక పదవిగా కాకుండా పార్టీకి, ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశంగా భావిస్తున్నాను అని రవి అన్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లడంతో పాటు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి నా వంతు కృషి చేస్తానని, మాచర్ల నియోజకవర్గంలోని జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. స్థానిక సమస్యలను గుర్తించి ప్రజల పక్షాన నిలబడి, పార్టీ అధిష్ఠానం సూచనలు మరియు మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేస్తాను. నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కి మరొకసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు రవి తెలియజేశారు.

# శ్రీ శోభారాణి మెడికల్స్ ఉ శ్రీ సాయి సుధా ప్రథమ చికిత్సా కేంద్రాన్ని ప్రారంభించిన డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి

**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 6**





లక్కిరెడ్డిపల్లికి చెందిన ఆర్ ఎం పి డాక్టర్ గునిశెట్టి సుధాకర్ ఆహ్వానం మేరకులి, రాయచోటి రోడ్డులోని సూపర్ కె పక్కన నూతనంగా నిర్మించిన శ్రీ శోభారాణి మెడికల్స్ ఉ శ్రీ సాయి సుధా ప్రథమ చికిత్సా కేంద్రాన్నిలి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి ఈ సందర్భంగా ఆర్ ఎం పి డాక్టర్ గుణిశెట్టి సుధాకర్ కి హృదయపూర్వక హార్దిక శుభాకాంక్షలు తెలియజేసిన డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి అలాగే ప్రజలకు మెరుగైన చికిత్స అందించి, డాక్టర్ గా మంచి పేరు ప్రతిష్టలు పొందాలని ఆకాంక్షించిన డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యనమల మదన్మోహన్ , క్లస్టర్ కన్వీనర్ శంఖారాపు జయరాం , మద్దిరేవుల సింగిల్ విండో అధ్యక్షుడు బత్తిన దేవేందర్ రెడ్డి , గంగమ్మ ఆలయ చైర్మన్ సోడి వెంకటేశ్వర్లు యాదవ్ , మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి , దిన్నెపాడు చెరువు చైర్మన్ మోహన్ రెడ్డి , గవర్నమెంట్ హాస్పిటల్ కమిటీ సభ్యులు కొండూరు వెంకటరామరాజు , మాజీ ఎంపిటిసి గంగయ్య,ధర్మరాజు, డీలర్ అన్వర్ సాదత్, యూనిట్ ఇంచార్జ్ బాలే పెద్ద రెడ్డయ్య యాదవ్, కావలి అంజి,భాస్కర్ రెడ్డి,సురేంద్ర రాజు, సహదేవ,టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారులి

# నిరుపయోగంగా మహిళా సమైక్య భవనం

- **అక్షరాలా 13 లక్షలు ప్రజాధనం**

**నరసాపురం సెప్టెంబర్ 6 జనసముద్రం ప్రతినిధి ధనంజయ్**





మహిళల ఆర్థిక సామాజిక అభివృద్ధికి ఉపయోగపడాల్సిన మహిళా సమైక్య భవనం నిరుపయోగంగా మారడంపై వేములదీవి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 2019లో అప్పటి టిడిపి ప్రభుత్వం సుమారు రూ.13 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం ఉపయోగంలో లేకపోవడంతో లక్ష్యమే నీరుగారిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, పొదుపు సంఘాల కార్యకలాపాలు, మహిళలకు ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ భవనం ఉపయోగపడాల్సి ఉంది. అయితే నిర్మాణం పూర్తయినప్పటికీ తగిన విధంగా వినియోగంలోకి రాకపోవడంతో భవనం లక్ష్యం నెరవేరడం లేదని గ్రామస్థులు అంటున్నారు. రూ.13 లక్షల ప్రజాధనం వెచ్చించిన భవనం ఇలా నిరుపయోగంగా ఉండటం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. భవనాన్ని మహిళా సంఘాలకు అందుబాటులోకి తీసుకువచ్చి, క్రమం తప్పకుండా సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భవనాన్ని పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టి మహిళా సమైక్య భవనాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని వేములదీవి గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# ట్రెండ్ మారిందా.. మార్చారా?

- **పంట కాలువల నిర్వహణలో కొత్త పద్ధతి..**
- **చెత్త తొలగింపుకే పరిమితమా?**
- **పూడికతీత లేక సాగునీటి ప్రవాహానికి ఆటంకం.. రైతుల్లో ఆందోళన**

**నరసాపురం సెప్టెంబర్ 6 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**





పంట కాలువల నిర్వహణలో ట్రెండ్ మారిందా.. లేక అధికారులు ట్రెండ్ మార్చారా? గతంలో వేసవి కాలంలో కాలువలకు నీటి సరఫరాను నిలుపుదల చేసి, కాలువల్లో పేరుకుపోయిన మట్టి, పూడికను తొలగించే పనులు చేపట్టేవారు. దీంతో వర్షాకాలం, సాగు సీజన్‌లో నీరు సాఫీగా ప్రవహించేందుకు అవకాశం ఉండేది. అయితే ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని రైతులు అంటున్నారు. కాలువల్లో నీరు ప్రవహిస్తున్న సమయంలోనే చెత్తాచెదారం తొలగింపు పనులు చేపడుతూ.. కాలువలో పేరుకుపోయిన మట్టి, పూడికతీతపై మాత్రం పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నరసాపురం--దర్బరేవు వెళ్లే ప్రధాన పంట కాలువలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోందని స్థానిక రైతులు చెబుతున్నారు. కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించకుండా కేవలం నీటిలోని చెత్తను తొలగించడం వల్ల అసలు సమస్య పరిష్కారం అవుతుందా? అని ప్రశ్నిస్తున్నారు. కాలువ అడుగున మట్టి, పూడిక పేరుకుపోవడంతో నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చివరి ఆయకట్టు భూములకు సాగునీరు సక్రమంగా అందకపోతే పంటలపై ప్రభావం పడే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. ధనం ఖర్చు.. ప్రయోజనం ఎంత? ప్రభుత్వ నిధులతో కాలువల నిర్వహణ పనులు చేపడుతున్నప్పటికీ, పనులు పూర్తి స్థాయిలో జరగకపోతే ప్రజాధనం వృథా అయ్యే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు అంటున్నారు. వేసవిలో నీటిని నిలుపుదల చేసిన సమయంలోనే పూడికతీత పనులు చేపడితే కాలువ సామర్థ్యం పెరగడంతో పాటు సాగునీటి సమస్యలు కూడా తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

కాలువలోని అసలు సమస్యను వదిలేసి పైపై శుభ్రతకే ప్రాధాన్యం ఇవ్వడం ఎందుకు? పూడికతీత పనులు ఎప్పుడు చేపడతారు? కాలువ పూర్తి సామర్థ్యంతో నీటిని మోసుకెళ్లేలా చర్యలు ఎప్పుడు తీసుకుంటారు? అనే ప్రశ్నలు ఇప్పుడు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

## అల్లూరి జిల్లా పాడేరు ఆరోగ్యశాఖకుకేటాయించిన 6 కోట్లు ఎక్కడ?వివరాలు బహిరంగపరచాలి

- **ఎన్ హెచ్ఎంఏఓ పాత్ర పై పలు అనుమానాలు**
- **ప్రజా సంకల్ప వేదిక అల్లూరి జిల్లా ఇన్ చార్జ్ ఉల్లి.తలుపులు డిమాండ్.**



**జిల్లా ఇంచార్జి జన సముద్రం న్యూస్.తేది సెప్టెంబర్ 6**

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఆరోగ్య శాఖకు గిరిజనుల ఆరోగ్య సేవలు,మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్ హెచ్ ఏం) ద్వారా కేటాయించిన 6 కోట్లు ఎక్కడ ఖర్చు చేసారో వివరాలు, బిల్లులు అన్ని బహిరంగంగా తెలియ పరచాలని ప్రజా సంకల్ప వేదిక అల్లూరి జిల్లా ఇన్ చార్జ్ ఉల్లి తలుపులు డిమాండ్ చేస్తూ చింతపల్లిలో ఒక ప్రకటన విడుదల చేసారు ఎన్ హెచ్ ఏం ద్వారా విడుదల చేసిన 6 కోట్లు నిధులు దుర్వినియోగం జరిగిందని, గిరిజనులకు ఆరోగ్య సేవలు, సౌకర్యాలు అందించడంలో విఫలం చెందారని అన్నారు.ఎన్ హెచ్ఏం నిధులు ఏ ఏ పనులకు ఖర్చు చేసారో వివరాలు ఇవ్వాలని ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేయడం జరిగిందని, సమాచారం ఇవ్వకపోవడంతో అప్పీల్ చేయడం జరిగి 3 నెలలు అయినప్పటికీ స్పందించలేదన్నారు. దీంతో పలు అనుమానాలు వ్యక్తం అగుచున్నాయన్నారు. దీనిపై రాష్ట్ర సమాచార కమిషన్ కు,ఆరోగ్యశాఖ కార్యదర్శి కి, ఎన్హెచ్ఏం డైరెక్టరు కు ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు. ఉల్లి తలుపులు తో పాటు చింతపల్లి ఆర్టీఐ సభ్యులు రాష్ట్ర ఆర్టిఐ ఉపాధ్యక్షులు పి . రాము, రాష్ట్ర యాంటీ కరప్షన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి.సోమరాజు, అల్లూరి జిల్లా ప్రజా చైతన్య విభాగం ప్రెసిడెంట్ పి. రాంబాబు, జిల్లా ఆర్టీఐ అడిషనల్ సెక్రెటరీ జి . బాలకృష్ణ, అల్లూరి జిల్లా రాష్ట్ర నాయకులు ఉన్నారు.

## భీమవరం ఓవర్ బ్రిడ్జికు డా యల్లప్రగడ నామకరణం చేయాలి

- **ఎమ్మెల్యే అంజిబాబు కు వినతి**
- **వినతిపత్రాన్ని అందించిన యల్లప్రగడ సుబ్బారావు జయమహోత్సవ కమిటీ సభ్యులు**



**భీమవరం సెప్టెంబర్ 6 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**

వైద్య రంగంలో అద్భుతాల సృష్టికర్త యల్లాప్రగడ సుబ్బారావు అని, వైద్య రంగంలో ఆయన చేసిన సేవలు ఎనలేనివి అమూల్యమైనవని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం ఓవర్ బ్రిడ్జి (ఫ్లైవర్) కు వైద్య రంగ పితామహుడు డా యల్లప్రగడ సుబ్బారావు నామకరణం చేయాలని ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో యల్లప్రగడ సుబ్బారావు జయమతోత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అంజిబాబు కు వినతిపత్రాన్ని అందించారు. కమిటీ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ డా యల్లాప్రగడ పరిశోధనలు ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మంది ప్రాణాలను కాపాడాయని, క్యాన్సర్ కణాల పెరుగుదలను అడ్డుకునే 'మెథోట్రెక్సేట్' అనే కీమోథెరపీ మందును ఆయనే కనుగొన్నారని, నేటికీ బ్లడ్ క్యాన్సర్ ఇతర క్యాన్సర్ల చికిత్సలో దీనిని వాడుతున్నారని అన్నారు. అటువంటి మహోన్నతి వ్యక్తి పేరును భీమవరం ఓవర్ బ్రిడ్జికు పెట్టాలని కోరుతున్నామని, భావితరాలకు మహోన్నత చరిత్ర తెలియజేస్తున్నట్లేనని అన్నారు. దీనిపై ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ మహోన్నత వ్యక్తుల చరిత్ర భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని, భీమవరం ఓవర్ బ్రిడ్జికు డా యల్లప్రగడ నామకరణం చేయడానికి కృషి చేస్తానని అన్నారు. కమిటి సభ్యులు అరసవల్లి సుబ్రమణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు, కలిగొట్ల గోపాలశర్మ, డా ఎస్ సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# గోవిందరాజుల స్వామివారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్



**జన సముద్రం న్యూస్ రాజన్న సిరిసిల్ల జిల్లా రూరల్ ప్రతినిధి సెప్టెంబర్ 6**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గం చందుర్తి మండలం సనుగుల గ్రామంలోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజుల స్వామి వారిని ఆదివారం ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు

ఆలయ కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్ కు ఘనస్వాగతం పలికారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు

గోవింద రాజుల స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పాడిపంటలతో సంతోషంగా ఉండాలని వేడుకున్నారు.

# పెద్దగోవిందు మృతికి నివాళులు అర్పించిన శ్రీకాంత్ రెడ్డి



**రామాపురం జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 6**

రామాపురం మండలం కల్పానాయుని చెరువుకు చెందిన గోవిందు. పెద్ద గోవిందు అనారోగ్యంతో మృతిచెందారు.పెద్దగోవిందు భౌతిక కాయాన్ని వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సందర్శించి నివాళులు అర్పించారు. అతని మృతిపట్ల సంతాపం తెలిపి వారి కుటుంభ సభ్యులను పరామర్శించారు. మాజీ సర్పంచులు వెంకట సుబ్బారెడ్డి,వెంకట్రామి రెడ్డి,కృష్ణయ్య, వైస్ ఎంపిపి బాబు, సగినాల శివ శంకర తదితరులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్





**చిన్నమండెం జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 6**

చిన్నమండెం మండలం బోరెడ్డి గారి పల్లెలోని తన సొంత నివాసంలో లిఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి లి ప్రజా దర్బార్ నిర్వహించారు.

ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను మంత్రివర్యుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఒక్కరి సమస్యను ఓపికగా విని, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలకు పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు

# ధర్మవరం కోదండరామ స్వామి ఆలయానికి నూతన శోభ..

## రూ.70 లక్షలతో గర్భాలయ నిర్మాణానికి శంకుస్థాపన.

- నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్
- ఆధ్యాత్మిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట.. ధర్మవరం ఆలయ నిర్మాణానికి రూ.70 లక్షల నిధులు.

**నెల్లూరు, సెప్టెంబర్ 6, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**



వరికుంటపాడు మండలం, కొండాయపాలెం పంచాయతీ పరిధిలోని ధర్మవరం గ్రామంలో శ్రీ కోదండరామస్వామి నూతన గర్భాలయ, ఆలయ నిర్మాణ శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. గౌరవ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి సహకారంతో ఆలయ అభివృద్ధి కోసం మంజూరైన రూ.70 లక్షల నిధులతో చేపడుతున్న నూతన నిర్మాణ పనులకు శంకుస్థాపన నిర్వహించారు.

ఈ పుణ్యకార్యక్రమంలో గౌరవ ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి ద్వారా గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు మరింత బలం చేకూరుతుందని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ధర్మవరం గ్రామానికి ఈ ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత విశిష్టతను సంతరించుకుంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శ్రీ కోదండరామస్వామి వారి ఆశీస్సులు ఉదయగిరి నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ, ఆలయ అభివృద్ధికి సహకరించిన దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధితో పాటు ప్రజల మనోభావాలకు అనుగుణంగా దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఉద్యోగుల ముఖాల్లో చిరునవ్వులు నింపిన ఉద్యోగుల పెద్దన్న మన చంద్రన్న!

- 12వ పీఆర్సీ ఏర్పాటు.. రెండు డీఏల ప్రకటన.. ఉద్యోగులకు చారిత్రాత్మక శుభవార్త!
- పెండింగ్‌లకు ఫుల్‌స్టాప్.. ఉద్యోగుల సంక్షేమానికి గ్రీన్ సిగ్నల్!
- మాటలు కాదు.. చేతలు! హామీలు కాదు.. అమలు! ఇదే చంద్రబాబు మార్క్ పాలన!
- -- మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జున రావు

**జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 06**



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి శుభవార్త అందించారని మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జున రావు అన్నారు. 12వ పీఆర్సీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడంతో పాటు రెండు డీఏలను ప్రకటించడం ఉద్యోగుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ఉన్న చిత్తశుద్ధి, నిబద్ధతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని యాగంటి మల్లికార్జున రావు విమర్శించారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉపాధ్యాయులను వారి అసలు విధులకు సంబంధం లేని పనులకు వినియోగించడం, అవమానకర పరిస్థితుల్లో పనిచేయాల్సిన పరిస్థితులు రావడం ఉద్యోగ వర్గాలను తీవ్రంగా బాధించిందని అన్నారు.

“ఉద్యోగుల గౌరవాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం.. వారిని ఇబ్బందులకు గురిచేసే పరిస్థితులు గతంలో చూశాం. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాల్సిన పాలన.. వారిని ఆందోళనకు గురిచేసిన రోజులు కూడా ఉన్నాయి” అని ఆయన అన్నారు.

2019--2024 మధ్య ఉద్యోగులకు జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొని ఉండేదని ఆయన పేర్కొన్నారు. నెల మొదటి తేదీ వచ్చినా జీతం పడుతుందా లేదా అనే ఆందోళనతో ఉద్యోగులు, వారి కుటుంబాలు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేదని అన్నారు.

ఒకటో తేదీ జీతం.. ఉద్యోగ కుటుంబాల్లో భరోసా!

అయితే 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్యోగుల విషయంలో స్పష్టమైన మార్పును తీసుకొచ్చారని యాగంటి మల్లికార్జున రావు తెలిపారు.

ప్రతి నెలా ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు అందేలా చర్యలు తీసుకోవడం ద్వారా ఉద్యోగ కుటుంబాల్లో భరోసా, ఆనందం నింపారని కొనియాడారు.

“జీతం ఎప్పుడు పడుతుందో అని ఎదురుచూసే పరిస్థితి నుంచి.. ఒకటో తేదీ జీతం వస్తుందనే నమ్మకాన్ని ఉద్యోగుల్లో కల్పించిన నాయకుడు చంద్రబాబు ” అని ఆయన అన్నారు.

12వ పీఆర్సీ.. రెండు డీఏలు.. ఉద్యోగుల సంక్షేమానికి చారిత్రాత్మక నిర్ణయం!

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించకుండా 12వ పీఆర్సీ ఏర్పాటు, రెండు డీఏల ప్రకటన వంటి కీలక నిర్ణయాలు తీసుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టికి నిదర్శనమని యాగంటి మల్లికార్జున రావు పేర్కొన్నారు.

ప్రభుత్వంపై భారీ ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమం కోసం ముందుకు రావడం చంద్రబాబు ఉద్యోగుల పట్ల ఉన్న ప్రేమకు, బాధ్యతకు నిదర్శనమన్నారు.

“ఉద్యోగుల ఆనందమే ప్రభుత్వ ఆనందం అన్న భావనతో చంద్రబాబు నిర్ణయాలు తీసుకుంటున్నారు!”

ఉద్యోగులు ప్రభుత్వ వ్యవస్థకు వెన్నెముక అని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వారి సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తున్నారని అన్నారు.

హామీలు ఇచ్చి మరిచిపోయే నాయకత్వం ఒకటైతే... ఇచ్చి మాటను నిలబెట్టి ఉద్యోగుల జీవితాల్లో భరోసా నింపే నాయకత్వం చంద్రబాబు అని యాగంటి మల్లికార్జున రావు స్పష్టం చేశారు.

ఉద్యోగులారా.. ఇది మీ ప్రభుత్వం.. మీ సొంత ప్రభుత్వం!

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ కూటమి ప్రభుత్వాన్ని తమ సొంత ప్రభుత్వంగా భావించాలని యాగంటి మల్లికార్జున రావు పిలుపునిచ్చారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, వారి సంక్షేమం కోసం, వారి కుటుంబాల భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు.

“చంద్రబాబు నాయకత్వంలో నడుస్తున్న ఈ ప్రభుత్వం ఉద్యోగులకు చేదోడు--వాదోడుగా ఉంటుంది. మీ కష్టాల్లో మీ వెంట నిలుస్తుంది. మీ హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటుంది” అని పేర్కొన్నారు.

ఉద్యోగులందరూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆయన కోరారు.

అభివృద్ధి ఒకవైపు.. సంక్షేమం మరోవైపు.. ఇదే చంద్రబాబు పాలన!

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ అదే సమయంలో ఉద్యోగులు, రైతులు, మహిళలు, యువత, పేదలు సహా అన్ని వర్గాల సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తున్న నాయకుడు చంద్రబాబు నాయుడు ని యాగంటి మల్లికార్జున రావు పేర్కొన్నారు.

12వ పీఆర్సీ ఏర్పాటు, రెండు డీఏల ప్రకటన ఉద్యోగులపై కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.

మాటలు కాదు... చేతలు!
హామీలు కాదు... అమలు!
పెండింగ్‌లు కాదు... పరిష్కారాలు!
ఆందోళన కాదు... ఆనందం!
ఇదే ఉద్యోగుల పెద్దన్న చంద్రన్న మార్క్ పాలన!

యాగంటి మల్లికార్జున రావు
మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్
తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు

# ఆశ్రమం సందర్శించిన డిప్యూటీ ఏ. ఇ, నరసింహులు

**రైల్వే కోడూరు జనసముద్రం న్యూస్ సెప్టెంబర్:06,**











ఆంధ్రప్రదేశ్ తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె మండలం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఆర్ డబ్ల్యు ఎస్ విభాగంలో డిప్యూటీ ఏ.ఇ గా విధులు నిర్వహిస్తూ ఓబులవారిపల్లి మండలం పెద్దఓరంపాడు గ్రామపంచాయతీ పాపిరెడ్డి పల్లె సమీపంలోని అప్పారావు సర్కిల్ కాశీనగరం జీవనజ్యోతి ఆనంద నిలయం శాశ్వత నిత్య అన్నదాన ఆశ్రమం నందు వృద్ధులను ప్రత్యేకంగా విచారిస్తూ ఆశ్రమం శుభ్రత లోపం ఏమైనా ఉందా అని అడిగి తెలుసుకుంటూ ప్రతిరోజు అందిస్తున్న ఆహారం ఏదైనా లోపాలు ఉంటే తెలపండి త్రాగునీరు ఏవైనా ఇబ్బందులు అయితే తెలపండి అని ఒక్కొక్కరిని విచారించి అనంతరం ఆర్కే హెల్పింగ్ హాండ్స్ కువైట్ వారి బృందం ఏర్పాటు చేసిన అద్భుత ప్రత్యేక అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ఓబులవారిపల్లి మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఆర్ డబ్ల్యు ఎస్, విభాగం డిప్యూటీ ఏ. ఇ విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగి నరసింహులు వారి చేతుల మీదుగా భోజనాలను వడ్డించి అందరితో కలిసి వారు కూడా భోజనం చేయడం ఆశ్రమం సహాయం చేయడం అలవాటుగా మార్చుకోవడం, మానవత్వం మన అందరిదీ, మానవ సేవే మాధవ సేవ అను నినాదాలు పైన కొనసాగుతున్న ఆశ్రమం సందర్శించు గొప్ప అవకాశం దొరికినందుకు చాలా ఆనందంగా ఉందని ప్రభుత్వ ఉద్యోగి ఆర్ డబల్యూ ఎస్ విభాగం డిప్యూటీ ఏ ఇ నరసింహులు తెలిపారు

ఆర్కే హెల్పింగ్ హాండ్స్ కువైట్ వారి బృందం నిత్య అన్నదానంలో ఒక భాగమై ఆశ్రమంలో ఒక భాగమై ఆశ్రమం ప్రారంభం నుండి నేటి వరకు జీవనజ్యోతి ఆనంద నిలయం శాశ్వత నిత్య అన్నదాన ఆశ్రమం కు ఆర్కే హెల్పింగ్ హాండ్స్ కువైట్ వారి బృందం అనుబంధ సేవలు అందించడం ఆర్కే హెల్పింగ్ హాండ్స్ దిన దినాభివృద్ధి చెందాలని ఆశ్రమంలో ఆకలి తీర్చుకున్న ప్రతి ఒక్కరూ ప్రత్యేక కృతజ్ఞతలు ద్వారా తెలిపారు.

# చింతపల్లి మండలంలో గురుపూజోత్సవం సందర్భంగా టీచర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**జిల్లా ఇంచార్జి జన సముద్రం న్యూస్ తేది సెప్టెంబర్ 6**






అల్లూరి జిల్లా చింత పల్లి మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించి, విద్యారంగానికి విశేష సేవలందించిన భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘనంగా నివాళులర్పించారు.

చింతపల్లి మండలం కిటుముల గ్రామసభ ప్రారంభానికి ముందు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ, సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని పలువురు పేర్కొన్నారు. చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అంగన్వాడీ టీచర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, సీడీపీఓ, సెక్టార్ సూపర్వైజర్లు, సెక్రటరీ, మహిళా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. గురువుకు గౌరవం... విద్యకు ప్రాధాన్యం... సమాజాభివృద్ధికి బలమైన పునాది అంటూ చింతపల్లి మండలంలో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా కొనసాగాయి.

# వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువకు సాగునీటి విడుదల

**దిగువ ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం -- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**





**గాలివీడు జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 6**

గాలివీడు మండలం వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువ నుంచి దిగువ ప్రాంతాల ఆయకట్టు రైతుల సాగునీటి అవసరాల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి లి నీటిని విడుదల చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దిగువ ఆయకట్టులోని రైతుల పంట పొలాలకు సాగునీరు అందించేందుకు 0.5 టీఎంసీల నీటిని విడుదల చేయడం జరిగింది తెలిపారులి. నీటి విడుదలతో దిగువ ప్రాంతాల్లోని కాలువలు, చెరువులు నిండడంతో పాటు రైతుల పంట పొలాలకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఇరిగేషన్ అధికారులను మంత్రి ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రైతుల సంక్షేమం, సాగునీటి వసతుల మెరుగుదలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, తెలుగుదేశం పార్టీ మండల నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ ఇన్‌చార్జులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ఉత్తమ ఉపాధ్యాయినీ అవార్డు గ్రహీత కి అభినందనలు తెలిపిన శ్రీనివాస్ ముదిరాజ్

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, సెప్టెంబర్ 6;**



మాచర్ల నియోజకవర్గం లోని వెల్దుర్తి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన మాడెబోయిన విజయ పద్మ ముదిరాజ్ మాడెబోయిన గోపయ్య ముదిరాజ్, వరలక్ష్మి ల ఏకైక కూతురు విజయ పద్మ ముదిరాజ్ పల్నాడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విప్ మరియు వినుకొండ ఎమ్మెల్యే జీవి ఆంజినేయులు, పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు ఇచ్చిన సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బిళ్ళకంటి శ్రీనివాస్ ముదిరాజ్ అభినందనలు తెలిపారు.

# వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ వైభవానికి రూ.8.74 కోట్లతో మహా అభివృద్ధికి శ్రీకారం

- నరసింహకొండలో రూ.8.74 కోట్ల సీజీఎఫ్ నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి శ్రీ ఆనం రామనారాయణరెడ్డి
- నెల్లూరురూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన

**నెల్లూరు, సెప్టెంబర్ 6, జనసముద్రం జిల్లా ప్రతినిధి**





వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని మరింత దివ్యమైన పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు పెద్దఎత్తున అభివృద్ధి పనులుమంత్రి ఆనం, కోటంరెడ్డి సోదరుల ప్రత్యేక చొరవతో ఆలయ అభివృద్ధికి బృహత్తర కార్యాచరణ నెల్లూరు జిల్లాలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న నరసింహకొండ శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ వైభవాన్ని మరింత ఇనుమడింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆలయాన్ని మరింత దివ్యమైన ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరురూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి నరసింహకొండలో రూ.8.74 కోట్ల సీజీఎఫ్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

జిల్లాలోని భక్తులకు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ఆలయ అభివృద్ధికి బృహత్తర కార్యాచరణ రూపొందించారు. ఆలయ ప్రాశస్త్యాన్ని మరింత పెంచే విధంగా అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక చొరవతో పాటు నెల్లూరురూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిల ప్రత్యేక కృషితో వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

భవిష్యత్‌లో నరసింహకొండను మరింత సుందరంగా, ఆధ్యాత్మికంగా, భక్తులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దే దిశగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు తెలిపారు.

# మావుళ్ళమ్మ జాతర మహోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు

**భీమవరం సెప్టెంబర్ 6 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**





భీమవరం రెస్ట్ హౌస్ రోడ్డులోని రామాలయం వద్ద శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి 67వ జాతర మహోత్సవాలను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. వాడవాడలా శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి జాతరలను సంప్రదాయ బద్దంగా నిర్వహించడం శుభ పరిణామమన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటున్నానని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. అనంతరం ఎమ్మెల్యే అంజిబాబును సత్కరించి సాంప్రదాయ బద్దంగా అమ్మవారి జాతరను కమిటీ సభ్యులు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. యాదవ సంఘం పట్టణ అధ్యక్షులు కొండ్రు శ్రీనివాస్, జిల్లా యాదవ సంఘం గౌరవాధ్యక్షులు గొలగని సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కందుల భానుప్రసాద్, గండమాని శివరామ్, కొర్ర రంగ, అయితం నరసింహ మూర్తి, బర్ల శివ, దువ్వి అప్పన్న, గొలగని చంద్రరావు, దువ్వి శివ, కే సింహాచలం, అల్లబోయిన నాగబాబు, జి సత్యనారాయణ, బర్ల మావుళ్ళ, కిలారి ప్రసాద్, గొలగని రమేష్, కే శ్రీను, జి సత్యనారాయణ, అల్లబోయిన లక్ష్మణ్, జి త్రినాథ్, పి పెద్దిరాజు, పి చక్రవర్తి, దేవర నరసింహ మూర్తి, దాసరి సత్యనారాయణ జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# దేవాలయం నిర్మాణానికి నిధులు మంజూరు

- పశువేముల గ్రామానికి మరో గొప్ప వరం..! పి. వెంకటకృష్ణ గౌడ్

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల మండలం, సెప్టెంబర్ 6;**



**పి.వెంకటకృష్ణ గౌడ్**
**పశువేముల గ్రామ టీడీపీ నాయకులు.**

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వారి శ్రీవాణి ట్రస్టు ద్వారా మాచర్ల నియోజకవర్గంలోని వివిధ దేవాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడం ఎంతో సంతోషకరం. మాచర్ల మండలం పశువేముల గ్రామంలోని సంత సేవాలాల్ దేవాలయ నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వానికి, ప్రజా సంక్షేమం మరియు అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కి గ్రామ ప్రజల తరఫున టీడీపీ నాయకులు పి.వెంకటకృష్ణ గౌడ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక అభివృద్ధికి అండగా... గ్రామాల అభివృద్ధికి తోడుగా... కూటమి ప్రభుత్వం! ఎప్పుడూ ముందుంటుందని అన్నారు.

# వైభవంగా శివ కళ్యాణం.



**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా సెప్టెంబర్ 6 ద్వారకాతిరుమల**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఉపాలయమైన క్షేత్ర పాలకునిగా విరాజిల్లుతున్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో శివదేవుని కళ్యాణ మహోత్సవం ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని వైభవంగా నిర్వహించిన ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముందుగా ఆలయ అర్చకులు ఆలయ ముఖా మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై గంగా, పార్వతి సమేత శివయ్య కళ్యాణమూర్తులను ఉంచి అర్చకులు పుష్పలంకారాలు చేశారు. శుభ ముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర బెల్లం ధరింపజేసి మాంగల్య ధారణ, తలంబ్రాలు, మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కళ్యాణాన్ని అత్యంత వైభవోపేతంగా జరిపారు.

# స్వర్ణ భారత్ ట్రస్ట్ లో

## మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో మంత్రి ఆనం మర్యాదపూర్వక భేటీ





**నెల్లూరు, సెప్టెంబర్ 6: జనసముద్రం జిల్లా ప్రతినిధి**

భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టులోని వెంకయ్య నాయుడు నివాసంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు తో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. రాజకీయ, సామాజిక అంశాలతో పాటు పలు వ్యక్తిగత, ఆత్మీయ విషయాలపై ఇరువురు చర్చించుకున్నారు.

స్వర్ణభారత్ ట్రస్టులో రేపు

సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ పురస్కరించుకొని పలువురు కీలక నేతలు జాతీయ ప్రముఖులు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హాజరు కానున్నారు. కాగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు , విజయవాడలో పార్టీకి సంబంధించిన అత్యంత ముఖ్యమైన కార్యక్రమాలు, బాధ్యతల్లో పాల్గొనాల్సి ఉండటంతో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ముందుగానే వెంకయ్య నాయుడు గారిని వ్యక్తిగతంగా కలిసి తన గౌరవాభిమానాలను అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి గారి భేటీ అత్యంత ఆత్మీయ వాతావరణంలో సాగింది.

# రామ మందిరంలో వైభవంగా కుంభాభిషేకం



**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**

**నెల్లూరు, సెప్టెంబర్ 6, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**

ఇందుకూరుపేట మండలం కొరుటూరులోని శ్రీ రామ మందిరంలో శనివారం సాయంత్రం నిర్వహించిన కుంభాభిషేక కార్యక్రమంలో కోవూరు శాసనసభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని శ్రీరామచంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలయ అర్చకుల నుంచి తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీరామచంద్ర స్వామివారి ఆశీస్సులు కొరుటూరు గ్రామ ప్రజలతో పాటు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ప్రశాంతమైన జీవితం గడపాలని, గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింతగా విస్తరించాలని ఎమ్మెల్యే ప్రార్థించారు. ఆలయ కుంభాభిషేక కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను, నిర్వాహకులను ఆమె అభినందించారు.

# చెక్కులను అందించిన:కామినేని



**జనసముద్రం న్యూస్ ప్రతినిధి వి. కె. ఆర్:**

ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం సెప్టెంబర్ 6 గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ కైకలూరు ట్రావెలర్స్ బంగ్లా నందు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి హాస్పిటల్ బిల్స్ నిమిత్తం మంజూరైన చెక్కులను లబ్దిదారులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

లబ్దిదారుల పేర్లు:
సానారుద్రవరం గ్రామస్థులు
కట్రెడ్డి విజయ్ గారికి రూ. 49,987/-
కైకలూరు గ్రామస్థులు
పిసిని పావని గారికి రూ. 42,276/-
పందిరిపల్లిగూడెం గ్రామస్థులు
ఘంటసాల వెంకటేశ్వరరావు గారికి రూ. 42,195/-
ఇంగిలిపాకలంక గ్రామస్థులు
జయమంగళ ఎస్తేరు రణి గారికి రూ. 36,327/-
4 లబ్దిదారులకు గాను రూ. 1,70,785/- లు మంజూరైనవి.

# దేవాలయాల నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉత్తర్వులు జారీ

**హర్షం వ్యక్తం చేసిన నవులూరి శివారెడ్డి**

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, సెప్టెంబర్ 6;**



**నవులూరి శివారెడ్డి,**
**అమరావతి పార్టీ ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు మాచర్ల సత్తెనపల్లి అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యే అభ్యర్థి.**

తిరుమల తిరుపతి దేవస్థానం(టిటిడి) వారి శ్రీవాణి ట్రస్టు ద్వారా మాచర్ల నియోజకవర్గంలో వివిధ దేవాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తూ ఏపీ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేయటం పట్ల అమరావతి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు మాచర్ల, సత్తెనపల్లి అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యే అభ్యర్థి నవులూరి శివారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వాటి వివరాలు... 1)రెంటచింతల మండలం, మంచికల్లు గ్రామంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం నిర్మాణాలకు నిధులు - రూ. 40 లక్షలు, (2) మాచర్ల మండలం, పశువేముల గ్రామంలో శ్రీ సంతు సేవాలాల్ స్వామి వారి దేవాలయం నిర్మాణానికి నిధులు - రూ. 40 లక్షలు, (3) వెల్దుర్తి మండలం, బోదిలవీడు గ్రామంలో శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానం నిర్మాణానికి నిధులు - రూ. 40 లక్షలు, (4). వెల్దుర్తి మండలంలోని, పట్లవీడు గ్రామంలో శ్రీ రామాలయం నిర్మాణానికి నిధులు - రూ. 40 లక్షలు , మొత్తం = రూ. 1 కోటి, 60 లక్షలు నిధులు మంజూరు చేస్తూ.. శుక్రవారం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది..! ఇందుకు గాను కృషి చేసిన మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మోనందరెడ్డి కి నవులూరి శివారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

# పేరుపాలెం బీచ్‌లో స్నానం చేస్తుండగా పిట్స్ గురైన వ్యక్తి
## పోలీసుల అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం



**మొగల్తూరు, సెప్టెంబర్ 6 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**

మొగల్తూరు మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పేరుపాలెం బీచ్‌లో ఆదివారం పెను ప్రమాదం తప్పింది. మెరైన్ పోలీసుల సమయస్ఫూర్తి, చాకచక్యంతో సముద్రంలో మునిగిపోతున్న ఓ వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డాడు వివరాల్లోకి వెళితే.. వీరవాసరం మండలం తోకలపూడి గ్రామానికి చెందిన ఎం సత్యనారాయణ పేరుపాలెం బీచ్‌ను సందర్శించేందుకు వచ్చారు. బీచ్‌లో సరదాగా గడుపుతున్న సమయంలో ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో అదుపుతప్పి సముద్రపు నీటిలో పడిపోయారు. అలల ఉధృతికి ఆయన నీటిలో మునిగిపోతుండటాన్ని గమనించిన మెరైన్ పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. మెరైన్ పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, సిబ్బంది ఏమాత్రం ఆలస్యం చేయకుండా సముద్రంలోకి దూకి సత్యనారాయణను సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. అప్పటికే ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, సిబ్బంది వెంటనే ప్రాథమిక చికిత్సలో భాగంగా సీపీఆర్ చేశారు. పోలీసుల సకాలంలో చేసిన ప్రయత్నాలతో సత్యనారాయణ కోలుకోవడంతో వెంటనే ఆటోను ఏర్పాటు చేసి చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. మెరైన్ పోలీసుల సమయస్ఫూర్తి, ధైర్యసాహసాలతో ఒక ప్రాణం నిలిచిందని స్థానికులు, పర్యాటకులు పేర్కొన్నారు. సకాలంలో స్పందించి సత్యనారాయణ ప్రాణాలను కాపాడిన హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, మెరైన్ పోలీసు సిబ్బందిని పర్యాటకులు, స్థానికులు, బాధితుడి కుటుంబ సభ్యులు అభినందించారు.

# యువ పరిశోధకురాలి ఘనవిజయం.



**పినపాక నియోజకవర్గం ప్రతినిధి , జన సముద్రం న్యూస్, సెప్టెంబర్ 6.**

విజయవాడ ఎంబెడెడ్ సిస్టమ్స్‌లో ఏంటెక్ అభ్యసిస్తున్న పినపాక మండల కేంద్రానికి చెందిన సిరి చందన ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది. జపాన్‌తో కలిసి నిర్వహిస్తున్న జాయింట్ రీసెర్చ్ ప్రోగ్రామ్‌కు పరిశోధకురాలిగా ఎంపికైంది. ఈ పరిశోధన కార్యక్రమంలో భాగంగా ఆమెకు సుమారు రూ.1.40 లక్షల స్టైపెండ్ లభించనుంది.ఈ అవకాశాన్ని సాధించడంలో కేఎల్ యూనివర్సిటీ విజయవాడకు చెందిన గైడ్ డా. వెంకట రత్నం అందించిన నిరంతర సహకారం, మార్గదర్శకత్వం కీలకంగా నిలిచాయి.అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ సంయుక్త పరిశోధన కార్యక్రమంలో పాల్గొనే అవకాశం దక్కడం ద్వారా ఆమె తన పరిశోధనా ప్రతిభను మరింత విస్తృత స్థాయిలో ప్రదర్శించనున్నారు. జపాన్‌కు చెందిన పరిశోధకులు, నిపుణులతో కలిసి పనిచేసే అవకాశం లభించడం ఆమె భవిష్యత్ పరిశోధనలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విద్యావేత్తలు తెలిపారు. ఆమె కష్టపడి పనిచేసే స్వభావం, పట్టుదల, ఎన్ని సవాళ్లు ఎదురైనా వెనుకడుగు వేయని నైజం ఈ విజయానికి కారణమయ్యాయని ఆమె తల్లిదండ్రులు ఊటుకూరి వెంకటేశ్వరరావు ( రమణ) రాధా( ఉపాధ్యాయురాలు) తెలిపారు.ఈ పరిశోధన కార్యక్రమంలో ఆమె ప్రతిభను చాటుకోవాలని, పరిశోధన విజయవంతంగా సాగి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత అవకాశాలు అందుకోవాలని,భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని కుటుంబ సభ్యులు ఆకాంక్షించారు.

# టి జి ఎస్ ఆర్ టి సి ఎంప్లాయీస్ యూనియన్ కార్మిక సోదర,సోదరీమణులకు విజ్ఞప్తి






**జన సముద్రం న్యూస్ సికింద్రాబాద్ 6 సెప్టెంబర్**

తేదీ:07.09.2026.సోమవారం రోజున తార్నాక ఆసుపత్రిలో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచార కార్యక్రమం ఉదయం 10 గంటల నుండి నిర్వహించబడును కావున గ్రేటర్ హైదరాబాద్ లో. పనిచేస్తున్న

రాష్ట్ర కమిటీ నాయకులు. జోనల్ కమిటీ నాయకులు. రీజనల్ కమిటీ నాయకులు. ముఖ్యంగా మహిళా నాయకులు,సభ్యులు,డిపో ప్రెసిడెంట్.డిపో సెక్రటరీ మరియు. కమిటి మెంబెర్స్,వీక్లీ ఆఫ్ లోఉన్నవారు, స్పెషల్ ఆఫ్ లోఉన్నవారు నైట్ అవుట్ ఇన్కమింగ్ అయిన వారూ అందరూ తప్పనిసరిగా తార్నాక హాస్పిటల్ కు రావలసిందిగా రాష్ట్ర కమిటీ పక్షాన కోరడమైనది.

తార్నాక హాస్పిటల్ కార్యక్రమం ముగిసిన తరువాత ఎం జి బి ఎస్ బస్ స్టేషన్ లో కార్మికులతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుంది. కావున ఎర్ర జెండా సైనికులు అందరూ తప్పనిసరిగా 10 గంటలకు తార్నాక హాస్పిటల్ కి రావాలని కోరుతున్నాము. ఈదురు వెంకన్న ప్రధాన కార్యదర్శి ఈ యు

# కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలి.



**పుల్లల చెరువు, సెప్టెంబర్ 7 జనసముద్రం న్యూస్.**

మండలం లోని అర్హులైన వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు కొత్త పింఛన్ల కు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడివో మరియదాసు తెలిపారు. కొత్తగా పింఛన్ల దరఖాస్తుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని ఆయన తెలిపారు. పింఛన్ లకు కొత్తగా దరఖాస్తూ చేసుకొనేవారు ఈ నెల 7వ తేదీ నుండి 16వ తేదీవరకు దరఖాస్తూ చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. వితంతు పింఛన్ కోసం దరఖాస్తూ చేసుకునేందుకుఆధార్ కార్డు, బియ్యం కార్డు, కుల, ఆదాయ ధ్రువీకారణపత్రాలు, భర్త మరణ ధ్రువపత్రం, వృద్దాప్య పింఛన్ కోసం దరఖాస్తూ చేసుకునేందుకు ఆధార్ కార్డు, బియ్యం కార్డు, కుల, ఆదాయం ధ్రువ పత్రాలు, ఒంటరి మహిళ పింఛన్ కోసం ఆధార్, బియ్యం కార్డులు, కుల, ఆదాయం ధ్రువీకారణ పత్రాలు, వి డాకు ల డిక్రీ, తహసీల్దార్ ధ్రువీకారణ పత్రం, వికలాంగుల పెన్షన్ కొరకు ఆధార్, రేషన్, కుల, ఆదాయం ధ్రువపాత్రాలు, సదరం సర్టిఫికెట్,వృత్తి ఆధారిత పెన్షనకోసం ఆధార్, రేషన్, కుల ఆదాయం, శాఖ ధ్రువీకారణపత్రం లు కావాలాన్నారు.పింఛన్లకు కొత్తగా దరఖాస్తూ చేసుకొనేవారు సంబంధిత డాక్యుమెంట్లను తీసుకొని స్వర్ణ గ్రామం సచివాలయాలకు వెళ్లి దరఖాస్తూ చేసుకోవాలని ఎంపిడివో మరియదాసు కోరారు.

H.O. Mobile : 9494184136
JANASAMUDRAM NEWS
Telugu Daily
RNI APTEL : 16151
జనసముద్రం న్యూస్
ప్రతి అక్షరం జనం కోసం
Published by Rajeshwari Publications
www.janasamudram.com fb/janasamudram 9494184136

# రైతులకు పామాయిల్ మొక్కలు పంపిణీ చేసిన మంత్రి తుమ్మల ఎమ్మెల్యే జారె

**జనసముద్రంన్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.**

అశ్వారావుపేట మండలం నారవారిగూడెం గ్రామంలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ రీజినల్ కార్యాలయం ఆయిల్‌పామ్ మొక్కల తయారీ నర్సరీలో ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ కార్యక్రమాన్నిమంత్రి తుమ్మల నాగేశ్వరరావు,స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తో కలిసి ప్రారంభించారు.

ఈ.సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును మరింత విస్తరించేందుకు ప్రభుత్వం రైతులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీతో పాటు బిందు సేద్యం కోసం రాయితీలు ఎరువులు సస్యరక్షణ చర్యలకు ప్రోత్సాహకాలు వంటి అనేక సౌకర్యాలను రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు మరింతగా వచ్చేలా ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని వివరించారు. ఆయిల్‌పామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా మంచి ఆదాయాన్ని అందించే పంటగా మారుతోందని పేర్కొన్నారు.

రైతులకు నాణ్యమైన మొక్కలు అందించడంతో పాటు సాగులో అవసరమైన సాంకేతిక సహకారం ప్రభుత్వ



ప్రోత్సాహకాలను అందించి ఆయిల్‌పామ్ రంగాన్ని మరింత అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.


ఈ. సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయిల్‌పామ్ గెలల ధర గణనీయంగా పెరిగిందని తెలిపారు.ధరలో తగ్గుదల లేకుండా క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలల ధర రూ 24 వేలకుపైగా పలుకుతోందని చెప్పారు.రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగానే ఆయిల్‌పామ్ రైతుల్లో నమ్మకం పెరిగిందని పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్ రైతులకు ఇంతటి మంచి ధర లభించేందుకు కృషి చేస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. రైతుల పక్షాన నిలబడి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు.

రైతులకు ఆదాయం పెంచే పంటలను ప్రోత్సహిస్తూ సాగుకు అవసరమైన రాయితీలు ఎరువులు బిందు సేద్యం సస్యరక్షణ చర్యలు మరియు ఇతర సౌకర్యాలను అందించడం ద్వారా ఆయిల్‌పామ్ సాగును మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.ఆయిల్‌పామ్ సాగుతో రైతుల జీవితాల్లో సిరులు కురుస్తున్నాయని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆయిల్‌పామ్ రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్,ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, అశ్వారావుపేట మున్సిపల్ చైర్‌పర్సన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, రావు గంగాధర్ రావు, మాజీ శాసనసభ్యులు తాటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# 5 వేల కీర్తనల రచయిత డాక్టర్ భట్టు వెంకన్నకు అరుదైన గౌరవం.
## వేలాది భక్తుల సమక్షంలో చిన్న జీయర్ స్వామీజీ ప్రశంసలు.. "మరో అన్నమయ్య"గా అభినందన



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్టాఫ్ రిపోర్టర్: సెప్టెంబర్ 6 (జనసముద్రం న్యూస్):**

హైదరాబాద్ శ్రీకృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన ఉట్టి పండుగ వేడుకల్లో 5,000కు



పైగా భక్తి కీర్తనలు రచించిన డాక్టర్ భట్టు వెంకన్నకు అరుదైన గౌరవం లభించింది. వేలాది మంది భక్తుల సమక్షంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామీజీ ఆయన భక్తి, సంకీర్తన సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు.

భక్తి సంకీర్తనల ద్వారా ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తున్న డాక్టర్ భట్టు వెంకన్నను"మరో అన్నమయ్య"గా కొనియాడుతూ స్వామీజీ అభినందించినట్లు కార్యక్రమంలో పేర్కొన్నారు. ఉట్టి పండుగలో విజయం సాధించిన భక్తులకు వెంకన్న చేతుల మీదుగా బహుమతులు అందించే అవకాశాన్ని కూడా స్వామీజీ కల్పించారు.

ఈ గౌరవం తన జీవితంలో మరచిపోలేని మహాభాగ్యమని డాక్టర్ భట్టు వెంకన్న తెలిపారు. చిన్న జీయర్ స్వామీజీ ఆశీస్సులు తన సంకీర్తన, సేవా ప్రయాణానికి మరింత స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.ఇదే కార్యక్రమంలో అన్నమయ్య పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయ శంకర స్వామీజీ పలువురు భక్తులకు బహుమతులు అందజేశారు. ఆధ్యాత్మికత, సంప్రదాయం, సంస్కృతి, సేవాభావాలను ప్రతిబింబించిన ఈ వేడుకల్లో ప్రముఖులు, పండితులు, విద్యార్థులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

# ప్రమాదాలకు నిలయంగా మారిన రైల్వే ఓవర్ బ్రిడ్జి

**- మరమ్మతుల పేరుతో కాలయాపన.. శాశ్వత పరిష్కారం ఎప్పుడు?**
**- అధికారుల నిర్లక్ష్యానికి మరో ప్రాణం బలికావాలా?**

**బోనకల్, ఖమ్మం జిల్లా, జనసముద్రం న్యూస్ ప్రతినిధి, ఆదివారం, సెప్టెంబర్ 6:**

బోనకల్ మండల కేంద్రంలోని జగ్గయ్యపేటవైరా ప్రధాన రహదారిపై ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రయాణికుల పాలిట ప్రాణాంతకంగా మారుతోంది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ బ్రిడ్జిపై రహదారి దెబ్బతిని ఇనుప రాడ్లు బయటకు రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు ఈ ప్రాంతం మృత్యువుకు ఆహ్వానం పలికేలా తయారైంది.

చిత్రంలో కనిపిస్తున్న పరిస్థితి చూస్తే బ్రిడ్జి నిర్వహణపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. రహదారి కింద ఉన్న ఇనుప చువ్వలు బయటకు వచ్చి, భారీ గుంతలు ఏర్పడి, ప్యాచ్‌వర్క్‌లు ఊడిపోయి ప్రమాదకరంగా మారినా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ఇప్పటికే ఈ బ్రిడ్జికి పలుమార్లు మరమ్మతులు చేపట్టినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేయడం.. కొద్దిరోజులకే మళ్లీ రోడ్డు దెబ్బతినడం.. తిరిగి తాత్కాలిక పూడికలు వేయడం అనే తంతు ఎన్నాళ్లు కొనసాగిస్తారని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మరోవైపు బ్రిడ్జికి ఇరువైపులా సరైన రక్షణ కంచెలు, రింగులు, డివైడర్లు, హెచ్చరిక సూచికలు లేకపోవడం ప్రమాద తీవ్రతను మరింత పెంచుతోంది. గతంలో ఇదే ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో విలేకరి మంద సత్యానందం మృతి చెందడం ప్రజల మనసుల్లో ఇప్పటికీ విషాదాన్ని మిగిల్చింది. ఒక ప్రాణం పోయిన తర్వాత కూడా అధికారులు కళ్లు తెరవకపోతే మరో ప్రాణం పోయే వరకు వేచి చూస్తారా? అని ప్రజలు నిలదీస్తున్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే పరిస్థితులు ఏర్పడిన తర్వాత కూడా అధికారులు స్పందించకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత హడావుడిగా స్పందించడం కాదు.. ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడమే అధికారుల బాధ్యత అని స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు తాత్కాలిక మరమ్మతులతో చేతులు దులుపుకోకుండా, బ్రిడ్జిని పూర్తిస్థాయిలో పరిశీలించి నాణ్యమైన శాశ్వత మరమ్మతులు చేపట్టాలని, ఇరువైపులా రక్షణ ఏర్పాట్లు, డివైడర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని మండల ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. "ఇంకో ప్రాణం పోయే వరకు అధికారులు మేల్కొనరా?" అనే ప్రశ్న ప్రస్తుతం బోనకల్ ప్రజల నుంచి గట్టిగా వినిపిస్తోంది.

# గోదావరి పుష్కరాల కువచ్చేభక్తుల కోసం డార్మెంటరీనిర్మాణం



**జన సముద్రం న్యూస్ సెప్టెంబర్ 6 బ్యూరో చీఫ్ టెంపుల్ టౌన్ భద్రాచలం**

వచ్చే సంవత్సరం 2027 జూన్ జూలై నెలలో రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా లక్షలాదిమంది భక్తులు దివ్య క్షేత్రం భద్రాచలం వచ్చి పుణ్య గోదావరి పుష్కర స్నానాలు పుష్కరవిధులు ఆచరించుకుంటారు ఈ సందర్భంగా భక్తులకు కల్పించే సౌకర్యాలలో భాగంగా రూ 1.50 కోట్ల వ్యయంతో డార్మెంటరీ నిర్మాణాలకు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుభూమి పూజ నిర్వ పించారు.

భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలి : భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకి త్అధికారు లకు సూచించారు.

వచ్చే ఏడాది 2027 జూన్ - జులై నెలలో నిర్వహించే గోదావరి పుష్కరాలకు భద్రాచలం వచ్చే



భక్తుల సౌకర్యార్థం డార్మెంటరీ హాల్ నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తున్నామని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తెలిపారు.

గోదావరి పుష్కరాల కోసం భద్రాద్రి జిల్లాలోని దక్షిణ అయోధ్యగా పేరు ప్రఖ్యాతలు గడిచిన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంకు విచ్చేసి భక్తుల కొరకు ఈ డార్మెటరీ హాల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు.అందులో భాగంగా భద్రాచలంలోని అంబాసత్రం సమీపంలో ఉన్న పూర్వ సంస్కృత పాఠశాల వద్ద దేవాదాయ - ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో

డార్మెంటరీ జి ప్లస్ వన్ భవన్ " నిర్మాణానికి ఆదివారం భూమి పూజ కార్యక్రమాలను నిర్వహించగా ముఖ్యఅతిథిగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొని మాట్లాడారు.

అనంతరం భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే



గోదావరి పుష్కరాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తుందని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలవకుండా సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు.

గోదావరి పరివాహక ప్రాంతాలలో ప్రారంభించిన ఘాట్ నిర్మాణాలతో పాటు డార్మెంటరీ నిర్మాణాలను సకాలంలో త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఏడు జిల్లాలో గోదావరి పుష్కర పనులు కొనసాగుతున్నాయని, ముఖ్యంగా భద్రాచలంలో జరుగుతున్న పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగంగా సకాలంలో పూర్తి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం ఈ.ఓ దామోదర్, సర్పంచ్ పూనం కృష్ణ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


జనసముద్రం న్యూస్
ప్రతి అక్షరం జనం కోసం
విలేఖరులు కావలెను
http://www.janasamudram.com
జనసముద్రం న్యూస్ పత్రిక లో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ
జిల్లాలు,మండలాల వారీగా
విలేఖరులు కావలెను..
సంప్రదించండి..
9494184136